ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
శుక్రవారం 31 జనవరి 2025 | 5





బుర్రకథ..ఊపిరిగా!



మిరియాల అప్పారావు.. మొన్నటి వరకూ ఒక బుర్రకథ కళాకారుడు మాత్రమే.. ఆయన కళ కోసం ఎంత పరితపించారనేది సమాజానికి తెలియని వాస్తవం..ఆ వాస్తవంలోకి వెళ్లి చూస్తే ఆకలి.. కష్టాలు.. కన్నీళ్లు.. బాధలు.. బాధ్యతలు.. అయినా ఆయన మాత్రం కళను వదల్లేదు.. చివరి వరకూ కళనే ఊపిరిగా చేసుకుని జీవించారు.. ఎంతో మంది ఆ కళతో ఏం సాధించావన్నా చిరునవ్వే సమాధానం.. బుర్రకథకు ఆదరణ తగ్గినా తుది వరకూ అదే ఊపిరిగా బతికారు.. ఈ నెల 15వ తేదీన కళామతల్లి ఒడిలోనే ఒరిగిపోయారు..ఆయన లేకున్నా.. కష్టం ఎక్కడికి పోతోంది.. అందుకే కేంద్రం అందించే ఎంతో అత్యున్నత పురస్కారం పద్మశ్రీ దశదినకర్మ రోజునే వెతుక్కుంటూ వచ్చింది.. మళ్లీ మిరియాల బుర్రకథకు ఊపిరులూదింది..! - వివరాలు 6లో





గులాబీ తీసుకోండి.. హెల్మెట్ పెట్టుకోండి!

ఎన్నో ప్రమాదాలు ప్రాణాలు బలితీసుకుంటు న్నాయి.. ఇటీవల రోడ్డు ప్రమాదాల్లో యువత ఎక్కువగా ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు.. ప్రమాదం జరిగినా ప్రాణాలు పోకుండా కాపాడుకునే వీలుందని చెప్పినా ఎవరూ వినడంలేదు.. బాధ్యతను భారంగా ఫీలవుతున్నారు.. అలా వద్దు.. బాధ్యతగా ఫీలవ్వండి అంటూ రాజమహేంద్రవరంలో మహిళా కానిస్టేబుళ్లు హెల్మెట్లు పెట్టుకుని గురువారం ఊరంతా బైక్ ర్యాలీ చేశారు. జాతీయ రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా హెల్మెట్ ఆవశ్యకతపై అవగాహన కల్పించారు.. ఈ చిత్రంలోనే చూడండి.. గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం హెల్మెట్ లేకుండా బైక్‌లపై ప్రయాణిస్తున్న వారిని ఆపి ఒక గులాబీ ఇచ్చి ఇక హెల్మెట్ వాడండి అంటూ మర్యాదగా చెప్పడం కొసమెరుపు.. - 8లో

చెరువుల్లో 3.23 లక్షల చేప పిల్లల విడుదల

రాజానగరం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో 46 మైనర్ ఇరిగేషన్ చెరువుల్లో మత్స్యశాఖ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి మత్స్యసంపద యోజన (పీఎంఎస్‌వై) పథకం ద్వారా 3 లక్షల 23 వేల 820 చేపపిల్లలను విడుదల చేసినట్టు కలెక్టర్ పి. ప్రశాంతి తెలిపారు. రాజానగరం మండలం నందరాడలోని అడుసుమిల్లి వెంకయ్య చెరువులో కలెక్టర్ గురువారం చేపపిల్లలు విడుదల చేశారు.రాష్ట్రప్రభుత్వం ఉచితంగా మత్స్యకార సహకార సంఘాలకు చేప పిల్లలను సరఫరా చేసిందన్నారు. దీనివల్ల జిల్లాలోని మైనర్ ఇరిగేషన్ చెరువుల్లో చేపల ఉత్పత్తితో పాటు ఉత్పాదకత పెరుగుతుందని చెప్పారు.ఈ చేప పిల్లల విడుదల వల్ల 36 మత్స్యకారుల సహకార సంఘాల్లోని 5300 కుటుంబాల జీవనోపాధి మెరుగుపడుతుందన్నారు. మూడు, నాలుగు నెలల్లో చేపపిల్లలు పెరిగి పట్టుకోవడానికి అందుబాటులోకి వస్తాయన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలు మేరకు పీఎంఎస్‌వై కింద ఆక్వాజోన్‌లో ఉన్న చేపల చెరువులకు సబ్సిడీ అందించడం జరుగుతుందని చెప్పారు. ఇప్పటికే చెరువులు తవ్వినాన్‌ఆక్వాజోన్లో ఉన్నవారికి కుడా ప్రభుత్వ మార్గదర్శకాలు మేరకు అనుమతులకు ప్రభుత్వం ఆమోదించిందని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారి వి.కృష్ణారావు, జిల్లా మత్స్యసహకార సంఘం అధ్యక్షుడు బలసాడి రంగారావు, రాజానగరం తహశీల్దార్ జీఎల్ఎస్.దేవి, ఎంపీడీవో జె.ఎ.ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.



చేప పిల్లలు విడుదల చేస్తున్న కలెక్టర్

60 వేల హెక్టార్లలో ఎలుకల నిర్మూలన

జేడీఏ మాధవరావు

రాజమహేంద్రవరం రూరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా 60 వేల హెక్టార్లలో సామూహిక ఎలుకల నిర్మూలన చేపట్టాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు తెలిపారు. రూరల్ మండలం తొర్రేడులో సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించి మాట్లాడారు.జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో ఎలుకల మందు ఉచితంగా పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు.ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త సీహెచ్‌వీ.నరసింహరావు మాట్లాడుతూ ఎలుకల్లో వివిధ రకాలు ఉన్నా యని చిన్నతోక ఎలుక వరి పంటను ఎక్కువ నాశనం చేస్తుందన్నారు.విషపు ఎరలను సాయంత్రం అమర్చాలని తెలిపారు.అనంతరం తొర్రేడు సొసైటీ ఎరువుల గొడౌన్ మాధవరావు తనిఖీ చేసారు.ఈ కార్యక్రమంలో డీఆర్‌సీ ఏడీఏ జయ రామ లక్ష్మి, ఏడీఏ శ్రీనివాసరెడ్డి, వ్యవసా యాధికారి భీమరాజు, విస్తరణాధికారులు వేణు మాధవరావు పాల్గొన్నారు.



'పన్ను' లోటు!

- ఉమ్మడి తూ.గో. జిల్లాలో పేరుకుపోయిన ఆస్తిపన్ను బకాయిలు
- కార్పొరేషన్లు, మున్సిపాల్టీలు, నగర పంచాయతీల్లో రూ.173 కోట్ల పెండింగ్
- రూ.80 కోట్ల వరకు వసూలు అసాధ్యమన్న అధికారులు
- ఏళ్ల తరబడి వసూళ్లకు నానా తిప్పలు పడుతున్న అధికారులు.. టార్గెట్లతో కుస్తీ
- అత్యధిక బకాయిలు ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేటు దుకాణాలు, ఖాళీస్థలాలవే
- అత్యధికంగా కాకినాడ, రాజమహేంద్రి కార్పొరేషన్లలో సగానికిపైనే బకాయిలు
- అమలాపురం మున్సిపాల్టీలో రూ.14.65కోట్లకుగాను రూ.8.95 కోట్ల బాకీలు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఆస్తి పన్ను బకాయిలు కొండలా పేరుకుపోయాయి. ఏళ్లకు ఏళ్లు వసూలవక చుక్కలు చూపిస్తున్నాయి. కార్పొరేషన్లు, మున్సిపాల్టీలు ఎన్ని ప్రత్యేక డ్రైవ్‌లు చేపడుతున్నా మొండిబాకీలు కదలనంటున్నాయి. ఒకపక్క ఇంటి పన్నులు ఎంతో కొంత వసూలవుతున్నా ప్రైవేటు కంపెనీలు, పరిశ్రమలు, వాణిజ్య దుకాణాలు, ఖాళీ స్థలాల పన్నులు మాత్రం ఎక్కడివక్కడే అన్నట్టు కదలడం లేదు. దీంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా ఆస్తి పన్ను బకాయిలు రూ.173కోట్ల వరకు పేరుకుపోయాయి. ఇందులో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంతోపాటు గత కొన్నేళ్ల బకాయిలు సైతం కలిపి ఈ స్థాయిలో పేరుకుపోయాయి. అత్యధికంగా కాకినాడ జిల్లాలో రూ.80.17 కోట్లు, తూ.గో.లో రూ.74.80కోట్లు, అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో రూ.18.76 కోట్లు బాకీలు ఉన్నాయి. ఈ మొత్తం బాకీల్లో అత్యధికంగా ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేటు కంపెనీలు, ఖాళీ స్థలాలే ఉన్నాయి. ఎంత ప్రయత్నిస్తున్నా మొండిబాకీలు కదలడం లేదు. ఇందులో కొన్ని సంస్థలు, కంపెనీలవైతే ఏకంగా పదేళ్లకుమించే బాకీలున్నాయి. దీంతో ఈ బకాయిలను ఏంచేయాలో తెలియక అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

కదలితేగా..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా ఏటా ప్రతి ఇంటి యజమాని నుంచి ప్రైవేటు వాణిజ్య దుకాణాలు, పరిశ్రమలు, కంపెనీలు, ప్రభుత్వ కార్యాలయాలు, ఖాళీస్థలం యజమానులు ఆయా మున్సిపాల్టీలు, కార్పొరేషన్లకు ఆస్తిపన్ను చెల్లించాలి. లేదంటే మున్సిపల్ పరిపాలనశాఖ అపరాధ రుసుం సైతం వసూలు చేస్తుంది. మరోపక్క పన్ను వసూళ్లకు ఆయా మున్సిపాల్టీలు, కార్పొరేషన్లు ప్రత్యేక రెవెన్యూ విభాగం ద్వారా ఇంటింటికి, దుకాణాల వద్దకు వెళ్లి పన్నులు వసూలు చేస్తాయి. అటు ఆన్‌లైన్‌లోను చెల్లింపులు జరపొచ్చు. కానీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మాత్రం ఆస్తి పన్నుల వసూలు పెద్దగా జరగడం లేదు. ప్రతి ఏటా బాకీలు భారీగా పెరిగిపోతున్నాయి. మున్సిపల్ అధికారులు ప్రత్యేక డ్రైవ్‌లు చేపట్టి పన్నుల వసూళ్లు చేస్తున్నా కేవలం గృహ సంబంధిత పన్నులే ఎక్కువగా వసూలవుతున్నాయి. ప్రైవేటు సంస్థలు, కంపెనీలు, పరిశ్రమల నుంచి అసలు బాకీలు కదలడం లేదు. అటు ఖాళీ స్థలాల యజమానులు సైతం బకాయిలు చెల్లించడం లేదు. ఇక ప్రభుత్వ కార్యాలయాలైతే బడ్జెట్ లేక ఏళ్ల తరబడి పన్నులు కట్టడం లేదు. దీంతో ఇవన్నీ కలిపి కోట్లలో పేరుకుపోతున్నాయి. వీటిని ఎలా వసూలు చేయాలో తెలియక మున్సిపల్ అధికారులు తలపట్టుకుంటున్నారు. ప్రధానంగా కాకినాడ జిల్లాలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంతోపాటు పాత బకాయిలు కలిపి ఆస్తి పన్నుల బకాయిలు రూ.132.18కోట్లు వసూలు కావలసి ఉండగా, ఇంతవరకు రూ.52.01కోట్లు వసూలైంది. ఇంకా రూ.80.17కోట్లు రావలసి ఉంది. ఇందులో కాకినాడ కార్పొరేషన్‌కు పాత,కొత్త బకాయిలు కలిపి రూ.100.08 కోట్లు రావలసి ఉండగా, ఇంతవరకు రూ.37.30కోట్లే వసూలైంది. ఇంకా రూ.62.78 కోట్లుపైగా బకాయిలు వసూలు కావలసి ఉంది. అయితే ప్రభుత్వ కార్యాలయాలు, కొన్ని కోర్టు వివాదాల కారణంగా రూ.100 కోట్లలో రూ.20 కోట్ల వరకు పన్నులు వసూలయ్యే అవకాశం లేదని కమిషనర్ భావన వివరించారు. మిగిలిన రూ.80 కోట్లలో రూ.50 కోట్ల వరకు వసూలైందని తెలిపారు. ప్రధానంగా ఖాళీ స్థలాల పన్ను రూ.28కోట్ల వరకు రావలసి ఉందన్నారు. కానీ బాకీలపరంగా కాకుండా ఈ ఆర్థిక సంవత్సరం పన్ను వసూళ్లలో కార్పొరేషన్ రాష్ట్రంలో రెండో స్థానంలో ఉందన్నారు. మరోపక్క తుని మున్సిపాల్టీలో రూ.6.23 కోట్లకుగాను ఇంతవరకు రూ.3.81కోట్లు, పెద్దాపురం రూ.6.05 కోట్లకు రూ.3.22కోట్లు, సామర్లకోట రూ.7.33 కోట్లకు రూ.2.75కోట్లు, పిఠాపురం రూ.8.68 కోట్లకు రూ.2.67కోట్లు, ఏలేశ్వరం నగర పంచాయతీలో రూ.2.35 కోట్లకు రూ.96 లక్షలు, గొల్లప్రోలు రూ.1.47 కోట్లకు రూ.90 లక్షలే వసూలైంది.

తూర్పుగోదావరిలో..

రాజమహేంద్రవరం కార్పొరేషన్‌కు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంతోపాటు పాత బకాయిలు కలిపి రూ.119.46 కోట్ల ఆస్తిపన్ను వసూలవ్వాల్సి ఉంది. కానీ ఇందులో రూ.50.04 కోట్లే వసూలైంది. ఇంకా రూ.69.42 కోట్లు వసూలవ్వాల్సి ఉంది. అయితే ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేటు కంపెనీలు, పరిశ్రమలు, ప్రభుత్వ, ప్రైవేటు స్థలాల నుంచి మాత్రం ఆస్తిపన్నులు వసూలవడం లేదు. అధికారులు ఎన్ని నోటీసులు ఇస్తున్నా వీటి నుంచి స్పందన లేదు. అయితే ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ ఖాళీ స్థలాల నుంచి పన్నులు, కొన్ని న్యాయస్థానం వివాదాలతో కలిపి రూ.23 కోట్ల వరకు పన్నులు వచ్చే అవకాశం లేదని అంచనా వేస్తున్నారు. అటు నిడదవోలు మున్సిపాల్టీలో రూ.7.29 కోట్లకుగాను రూ.3.11 కోట్లే ఆస్తిపన్ను వసూలైంది. కొవ్వూరులో రూ. 3.86 కోట్లకు రూ.2.66కోట్లే వసూలైంది. వెరసి తూర్పుగోదావరి జిల్లాలో రూ.130.61కోట్ల మొత్తం ఆస్తిపన్ను బకాయిలకు ఇప్పటివరకు రూ. 55.81 కోట్లే వసూలైంది. ఇంకా రూ.74.80 కోట్లు వసూలు కావలసి ఉంది. అయితే ఇందులో సగం వరకు వసూలయ్యే అవకాశం తక్కువని అధికారులు ఓ అంచనాకు వచ్చారు.

కోనసీమలో ఇలా..

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ప్రధానంగా అమలాపురం మున్సి పాల్టీలో రూ.14.65 కోట్లకుగాను ఇంత వరకు రూ.5.70 కోట్లే వసూలైంది. మండ పేటలో రూ.7.75 కోట్లకు రూ.4.44 కోట్లు, రామచంద్రపురం రూ.9.47 కోట్లకు రూ.3.52కోట్లు, ముమ్మిడివరం రూ.1.57 కోట్లకు రూ.కోటి వసూలైంది.ఈ జిల్లాలో మొత్తం రూ.33.42 కోట్ల పన్నుల వసూలుకుగాను రూ.14.66 కోట్లే జమైంది. ఇంకా రూ.18.76 కోట్ల వరకు రావలసి ఉంది. అయితే మొండి బకాయిలు రూ.9 కోట్ల వరకు ఉన్నాయని ఇవి వచ్చే అవకాశం లేదని అధికారులు చెబుతున్నారు. ఒక రకంగా చెప్పాలంటే ఉమ్మడి జిల్లాలో ఆస్తిపన్నులకు సంబంధించి ఏటా ప్రతి ఆర్థిక సంవత్సరంలో కార్పొరేషన్లు, మున్సిపాల్టీలు టార్గెట్ల నేపథ్యంలో చాలా వరకు నివాస గృహాల నుంచే అధికారులు ముక్కుపిండి పన్నులు వసూలు చేస్తున్నారు. ప్రైవేటు కంపెనీలు, సంస్థలు, దుకాణాలు, ఖాళీ స్థలాల నుంచి మాత్రం రాబట్టడంలో విఫలమవుతున్నారు.





అక్షర..కదలిక

9వ డివిజన్‌లో శరవేగంగా పనులు

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : అక్షరం కదిలించింది..అందరినీ మేల్కొలిపింది.. సమస్యలపై సమర శంఖం పూరించింది.. పరిష్కారం దిశగా అడుగులు వేస్తోంది.. నాలుగు రోజుల కిందటి వరకూ ఆ కాలనీలో ఏ రోడ్డు చూసినా అధ్వానమే.. మరి నేడు ప్రతి రోజూ పారి శుధ్య చర్యలు చేపడుతున్నారు.. క్లీన్ అండ్ గ్రీన్‌గా తీర్చి దిద్దుతున్నారు. రాజమహేంద్రవరం 9వ డివిజన్ వెంకటేశ్వనగర్‌లో మంగళవారం ఏబీఎన్- ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో అక్షరం అండగా.. సమస్యల పరిష్కారమే అజెండాగా నినాదంతో నిర్వహించిన సభలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా ప్రజాప్రతినిధి, అధికారుల దృష్టికి తీసుకెళ్లిన సంగతి విదితమే. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే ఆది రెడ్డి శ్రీనివాస్ హామీ ఇచ్చినట్టుగానే ఆ ప్రాంతంలో అధికారుల చర్యలు వేగంగా సాగుతున్నాయి. గురువారం కూడా నగరపాలక సంస్థ ఎస్ఈ ఐ.పాండురంగారావు,ఈఈ రీటా, ఇంజనీరింగ్ అధికారుల బృందం,మాజీ కార్పొరేటర్ కోసూరి చండీప్రియ, పార్కు కమిటీ, స్థానిక పెద్దలు కలిపి వెంకటేశ్వనగర్‌లో పర్యటించారు. టీ షేప్ రహదారిని పరిశీలించారు.ఈ రోడ్డులో సగానికి గతంలో ప్రతిపాదన ఉంది మిగిలిన సగానికి కూడా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్టు ఎస్ఈ చెప్పారు.అదే రోడ్డులో డ్రైనేజీ సమస్యలపై పరిశీలన చేశారు. వెంకటేశ్వనగర్, విద్యుత్ కాలనీ, బర్మా కాలనీ ప్రాంతాల్లో డ్రైనేజీలను పారిశుధ్య కార్మికులు శుభ్రం చేశారు. రహదారుల పక్కల చెత్త కుప్పలను తొలగించారు. అధికారులు డివిజన్‌లో సమస్యలపై దృష్టి కేంద్రీకరించి పరిష్కారం దిశగా అడుగులు వేస్తున్నారు.









ఎస్‌బీఐ కాలనీ వాకర్స్ రోడ్డు 4వ వీధిలో గత ప్రభుత్వంలో నిర్మించిన డ్రైనేజీ అసంపూర్తిగా ఉంది.దీంతో అపార్టుమెంట్ వాసులు ఇబ్బందులు పడుతున్నారు.ఈ విషయాన్ని సమావేశంలో చెప్పడంతో ఎస్ఈ పరిశీలించారు.కల్వర్టు రహదారి కంటేఎత్తుగా ఉండి ప్రమాదాలు జరుగుతున్నాయి.

ఈ చిత్రంలోనే చూశారా డ్రెయినేజీ ఎంత శుభ్రంగా తయారైందో.. మరో డ్రెయినేజీ కూడా సిల్ట్‌తో నిండిపోవడంతో పారిశుధ్య కార్మికుడితో గురువారం శుభ్రం చేయించారు.

ఎన్నో జీవితాలను కథలుగా మార్చారు.. తందాన తాన తందనాన అంటూ బుర్రకథ రూపంలో ప్రజల చెంతకు తీసుకెళ్లారు.. ఆయన జీవితమూ ఒక కథే.. తరచి చూస్తే ఒక కన్నీటి జీవన ప్రయాణమే.. కళనే నమ్ముకుని ఏం సాధించారంటే పేరు తప్ప ఏం లేదు.. చివరి వరకూ కళనే నమ్ముకున్నారు.. ఆకలితో ఉన్నా ఆ కళను మాత్రం ఆపలేదు.. చివరి వరకూ అదే ఊపిరిగా జీవనయానం సాగించారు.. ఏదో ఒక రోజు తన కళ కడుపునింపక పోతుందా అంటూ ఎదురుచూశారు.. 76 ఏళ్ల జీవితంలో వెను తిరిగి చూస్తే వేల ప్రదర్శనలు.. అయితే ఆయన నమ్మకమే నిజమైంది.. తన కళ కడుపునింపేటంత పద్మశ్రీ అనే బిరుదును తెచ్చింది.. అయితే ఆ ఆనందాన్ని పంచుకోవడానికి.. ఆ పురస్కారం అందుకోవడానికి మిరియాల అప్పారావు మన మధ్యన లేరు.. ఆయన కుటుంబ పరిస్థితులను 'ఆంధ్రజ్యోతి' పరిశీలించగా ఎన్నో ఆసక్తికర విషయాలు వెలుగుచూశాయి.

- (ఆంధ్రజ్యోతి/ రావులపాలెం)



బుర్రకథ.. ఊపిరిగా..

మన పద్మశ్రీ మిరియాల అప్పారావు

కళ కళ కోసం ప్రజల కోసం.. అనే అన్వయం కచ్చితంగా బుర్రకథకు దక్కుతుంది. ఎందుకంటే మనకున్న జానపద కళారూపాల్లో హరికథ తర్వాత చాలా ముఖ్యమైన గాన ప్రక్రియ. మన తెలుగువాళ్లు ఈ కథా ప్రక్రియను ఎంత ప్రభావవంతంగా వినియోగించుకున్నారంటే జానపద, పౌరాణిక కథల నుంచి వీరోచిత ఉద్యమాలు, సామాజిక చైతన్య కార్యక్రమాల వరకు అత్యద్భుతంగా బుర్రకథ ఒదిగిపోయింది. ఇలా ఒదిగిపోవడానికి బుర్రకథా పితామహుడిగా షేక్ నాజర్ వేసిన పునాదులు అటువంటివి. ఆయనకు ప్రభుత్వం పద్మశ్రీ ఇచ్చి గౌరవించింది. అలనాటి బుర్రకథకుల్లో రావులపాలెంనకు చెందిన మరొక ఆణిముత్యం మిరియాల అప్పారావు. ఇటీవల మరణించిన ఆయనకూ పద్మశ్రీ ప్రకటించింది. ప్రభావంతమైన కథనంతోపాటు చతురతతో కూడిన హాస్యం, వినోద సంభాషణలతో రాగయుక్తమైన విన్యాసాల మధ్య సాగే బుర్రకథ.. కొన్ని దశాబ్దాలపాటు తిరుగులేని కళగా చరిత్ర సృష్టించింది. దీనికి కారణం ఒక నాజర్.. ఒక మిరియాల.. ఇంకా ఎందరో..

ఇప్పుడు నాణేనికి రెండో వైపు చూద్దాం. దాదాపు అయిదు దశాబ్దాలపాటు బుర్రకథే ప్రాణంగా మిరియాల అప్పారావు చివరి వరకు అదే తపనతో జీవించారు. ఇక్కడ మరొక ఆసక్తికరమైన విషయమేమిటంటే.. ఆయన కుటుంబం యావత్తూ ఇదే రంగంలో ఉండి జీవనం సాగిస్తుండడం. కాకపోతే వేలాది ప్రదర్శనలు ఇచ్చిన కళాకారుల కుటుంబాలు ఏ స్థాయిలో ఉన్నాయో చూద్దామని ప్రయత్నిస్తే చాలాసార్లు మనకు నిరాశే ఎదురవుతుంది. దానికి కారణం ఆ కళనే నమ్ముకుని, ముందు తరం వారసులుగానే తమ జీవితాలను కొనసాగించడానికి వారు శక్తినంతా ధారపోయడమే ఒక శాపమవుతోంది. ఈ నేపథ్యంలో వీరి కృషి కళారంగానికి ఎనలేని సేవ అనాలా.. కళనే నమ్ముకుని తమ 'భవిష్యత్తు'ని ధారపోసిన త్యాగమూర్తులనాలా..

ఇంటిల్లపాదీ బుర్రకథకులే..

కళను నమ్ముకుని ఎన్నో ప్రదర్శనలు ఇస్తూ గుర్తింపు తెచ్చుకున్న బుర్రకథ కళాకారులకు ఇవాళ ఆదరణ లేదు. కేవలం సామాజిక చైతన్య కార్యక్రమాల కోసమే ఈ కళారూపం అన్నట్టుగా మారిపోయింది. ఒక కుటుంబం ఐదు దశాబ్దాలపాటు బుర్రకథ కళారంగంలోనే జీవితం సాగించింది. ఒకరిద్దరు కాదు, ఇంటిల్లపాదీ ఇదే రంగానికి తమ జీవితాలను అంకితం చేసింది. యజమాని నుంచి కూతుర్లు, కొడుకులూ అందరూ ఇదే జీవనం. 50 ఏళ్లుగా.. వేలాది ప్రదర్శనలు.. సత్కారాలు, ప్రశంసలు, బిరుదులు.. హోరెత్తిన జనం చప్పట్లు..ఇవన్నీ దాటుకుని వచ్చిన ఈ కళాకార కుటుంబానికి ఇప్పుడు అష్టకష్టాలు. ప్రముఖ బుర్రకథ కళాకారుడు మిరియాల అప్పారావు. ఇటీవలే ఆయనకు పద్మశ్రీ లభించిన నేపథ్యంలో వారి కుటుంబాన్ని పలకరించినప్పుడు వెల్లడైన అనేక విషయాలు, కుటుంబ స్థితిగతులపై ప్రత్యేక కథనం.

స్మృతిచిహ్నం ఏర్పాటుచేయాలి

ఇంతటి కళాకారుడు తమ మధ్యన తిరగడం మా అదృష్టం అంటున్నారు రావులపాలెం ప్రజలు.. ఆయన స్మృతి చిహ్నం ఏర్పాటుచేయాలని కోరుతున్నారు. ఆయన ఇంటి చెంతనే ఉన్న పార్కులో మిరియాల అప్పారావు విగ్రహం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

వాస్తవ కథ విందాం...

మిరియాల అప్పారావు. ఈయనది కాకినాడ జిల్లా నడకుదురు. 1949లో మిరియాల వెంకట రామయ్య, తిరుపతమ్మలకు జన్మించారు. 1969లో బుర్రకథపై ఉన్న ఆసక్తితో ఇందులో అరంగ్రేటం చేశారు. డ్రాయింగ్ మాస్టర్ జూనియర్ నాజర్, రామిశెట్టి వీరేశం దగ్గర శిష్యరికం చేశారు. తర్వాత తనదైన వాక్చాతుర్యంతో, గాన మాధుర్యంతో బుర్రకథ కళాకారుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. 1974లో ఆలిండియా రేడియోలో, 1994లో దూరదర్శన్‌లో ఇచ్చారు. 1975లో పెద్దాపురంలో నిర్వహించి బుర్రకథల పోటీల్లో ప్రథమస్థానం సాధించి 50 తులాల వెండికప్ గెలుచుకున్నారు. 5వేలకు పైగా స్టేజీ ప్రోగ్రామ్‌లు, 365 రోజుల్లో 300 రోజులు బుర్రకథ ప్రదర్శనలతో రికార్డు సాధించారు. భార్య నాగమణితో పాటు తన ఏడుగురు సంతానంతో కలిసి బుర్రకథలను చెబుతూ వచ్చారు. అంతే కాకుండా షణ్ముఖ ఆంజనేయరాజుతో కలిసి పలు నాటకాల్లోనూ నటించారు. కళారంగంలో ఆయన ప్రతిభను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం అప్పారావుకు పద్మశ్రీ అవార్డును ప్రకటించింది. పద్మశ్రీ ప్రకటించే సమయానికి ఆయన మరణించడం, ప్రకటించిన రోజు దశదినకర్మ రావడంతో కుటుంబ సభ్యులకు పద్మశ్రీ వచ్చిందని ఆనందంగా ఉన్నప్పటికీ, అవార్డు గ్రహీత మరణం ఆ కుటుంబ సభ్యులను తీవ్ర ఆవేదననూ కలిగించింది.

ఇదీ కుటుంబ నేపథ్యం..

పద్మశ్రీ అవార్డు దక్కించుకున్న మిరియాల అప్పారావుకు భార్య నాగమణి, నలుగురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు. సుబ్బరాజు, బ్రహ్మాజీ, మిరియాల సిద్ధయ్య, బాబా, వీరనాల పద్మావతి, వీరనాల లలిత, యడవల్లి శ్రీదేవి. వీరిలో శ్రీదేవి తాడేపల్లిగూడెంలో ఉండగా మిగిలిన వారంతా రావులపాలెంలోనే ఉంటున్నారు. అప్పారావు తన 50 ఏళ్ల ప్రస్థానంలో 25 ఏళ్ల కిందట రావులపాలెంలో సొంతింటిని నిర్మించారు. ప్రస్తుతం ఆ ఇంటిలోనే నలుగురు కుమారులు తమ కుటుంబాలతో ఉండడం విశేషం.

చిన్న డాబా ఇల్లే ఆస్తి

76 ఏళ్ల కళాప్రయాణం..వేల ప్రదర్శనలు.. ఆయనకు ఉన్నది మాత్రం రావులపాలెంలో పార్కు వద్ద 4 సెంట్లు అంటే అంటే సుమారు 200 గజాల స్థలం.. ఆ స్థలంలోనే సుమారు 30 ఏళ్ల కిందట కట్టిన రెండు పోర్షన్ల చిన్న డాబా ఇల్లు.. అదే ఆస్తి.. ప్రస్తుతం ఆ చిన్న ఇంటిలోనే మిరియాల అప్పారావు నలుగురు కుమారులు సుమారు 20 మంది కుటుంబీకులు నివాసం ఉంటున్నారు.. తండ్రి వారసత్వంగా వచ్చిన బుర్రకథ కళనే నమ్ముకుని జీవనం సాగిస్తున్నారు.. ప్రభుత్వం తమను ఆర్థికంగా ఆదుకోవాలని కుటుంబీకులు వేడుకుంటున్నారు.



కుటుంబంతో మిరియాల అప్పారావు (ఫైల్)

చివరి కోరిక ఇదే..

ఆయన ధ్యాస.. శ్వాస బుర్రకథ.. అందుకే చివరి కోరిక కూడా అదే.. బుర్రకథ కోసం ఓ సంస్థను నెలకొల్పి నేర్పించాలన్నది ఆయన చివరి కోరిక. తరచూ కుమారులకు అదే చెబుతుండేవారట.. ఆ కోరిక తీరలేదు. బుర్రకథకు ఆదరణ తగ్గిన నేపథ్యంలో ఆ అవకాశం కలగలేదు.. ప్రభుత్వం ఆ అవకాశం తమకు కల్పించాలని కుమారులు వేడుకుంటున్నారు.. ప్రభుత్వం సహకరిస్తే బుర్రకథ కళను నలుగురికి నేర్పించి.. తమ తండ్రి చివరి కోరిక తీర్చుతామని చెబుతున్నారు.. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు సహకరించాలని కోరుతున్నారు.

నాన్న లేకపోవడం బాధగా ఉంది..



మా నాన్నగారు కళకోసం ఎంతో శ్రమించారు.. మా కంటే బుర్రకథనే ఎక్కువగా ప్రేమించారు. ఆయన శ్రమకు ఈనాటికి ఫలితం లభించింది. కానీ ఆయన నేడు మా మధ్య లేకపోవడం బాధగా ఉంది. కళ కోసం ఎంత కష్టపడ్డారో నేను దగ్గరగా చూశా.. ఇప్పటివరకూ ఆయన 5 వేల ప్రదర్శనలు ఇచ్చారు. నేను పదవతరగతి వరకూ చదువుకున్నా.. ఆ తరువాత నాన్నగారి ప్రమేయంతో కళారంగంలో అడుగుపెట్టా.

- మిరియాల సుబ్బరాజు, కుమారుడు

ప్రభుత్వం మాకు దారి చూపాలి..



బుర్రకథకు ఆదరణ తగ్గిపోయింది.. కళాకారుల కష్టానికి తగ్గ పారితోషికం దొరకకపోవడంతో కుటుంబ పోషణ భారమైంది. ఒకప్పుడు గణపతి, దేవినవరాత్రుల పర్వదినాలు, జాతర్ల సమయాల్లో ఆయా రోజుల్లో ప్రత్యేకంగా బుర్రకథ కళాకారులతో స్టేజీ ప్రోగ్రామ్‌లు చేయించేవారు. కానీ నేడు అలా లేదు.. బుర్రకథలకు ఆదరణ లేక కళాకారుల జీవన మనుగడ కష్టతరంగా మారింది. మా పరిస్థితి అలాగే ఉంది.. ప్రభుత్వమే దారి చూపాలి.

- మిరియాల బ్రహ్మాజీ, కుమారుడు

నాన్నబాటలో నడిచాం కానీ..?



చినప్పటి నుంచి మా నాన్న అడుగుజాడల్లోనే నడిచాం. బుర్రకథపై ఉన్న మక్కువతో ఈ రంగంలో స్థిరపడినప్పటికీ ప్రస్తుతం ఆదరణ కనుమరగవ్వడం బాధగా ఉంది. బుర్రకథ ఏర్పాటు చేసే నిర్వాహకులు తగ్గిపోయారు. అరకొరగా ఇచ్చే ప్రదర్శనలకు రూ.3 వేల నుంచి రూ.5 వేలు మాత్రమే వస్తున్నాయి. ఆ కొంత మొత్తం కథ చెప్పిన ముగ్గురు, పంచుకోవాల్సి వస్తోంది. ఈ వయసులో వేరే వృత్తుల వైపు వెళ్లలేక ఇబ్బందికర జీవనం సాగిస్తున్నాం.

- వీరనాల లలిత, కుమార్తె

వచ్చే నెలా.. అరకొరే !



- ఇంతవరకూ జిల్లాకు కందిపప్పు కేటాయింపు నిల్
- 20 శాతం మందికి మాత్రమే అందే అవకాశం
- పండగ ముందు 30 శాతం లబ్ధిదారులకే అందిన పప్పు
- జిల్లాకు 500 టన్నుల అవసరం

(రాజమహేంద్రవరం - ఆంధ్రజ్యోతి)

జిల్లాలోని రేషన్ కార్డుదారులకు ఫిబ్రవరి నెలలో కూడా కందిపప్పు అరకొరగానే అందనుంది. సంక్రాంతి నెలలో పూర్తిస్థాయిలో సరఫరా కాని విషయం తెలిసిందే. దీంతో వచ్చేనెల కూడా 20 శాతం మంది మాత్రమే పొందనున్నారు. గుజరాత్ నుంచి నాణ్యత లేని సుమారు 200 టన్నుల పప్పు రావడంతో తిరిగి పంపించేశారు. ప్రస్తుతం కొత్త టెండర్ల ప్రక్రియ జరుగుతోంది. ఈ నేపథ్యంలో వచ్చే నెలలో పూర్తిస్థాయిలో లబ్ధిదారులకు అందే అవకాశం లేదు. పప్పును తిరిగి పంపించేయడంతో ఈ నెలలో కొరత ఏర్పడిన సంగతి తెలిసిందే. గత నవంబరు నెల నుంచి ప్రతి కార్డుదారుడుకి రూ.67కే కేజీ కందిపప్పు ఇస్తున్నారు. బయట మార్కెట్‌లో రూ. 110 నుంచి 180 వరకూ విక్రయిస్తున్నారు. దీనిపై ప్రభుత్వం స్పందిస్తూ సబ్సిడీపై రూ.67కే నాణ్యమైన పప్పు అందివ్వడంతో ప్రజలంతా చాలా సంతోషించారు. గత వైసీపీ ప్రభుత్వం 2023 నుంచి కందిపప్పు ఇవ్వడం మానేసింది. పైగా ఎవరూ కందిపప్పు తినడం లేదని ప్రచారం కూడా చేసింది. కానీ గత ఎన్నికలలో ఘన విజయం సాధించిన కూటమి ప్రభుత్వం గత ఏడాది నవంబరు నెల నుంచి మళ్లీ అందిస్తూ వచ్చింది. కానీ జనవరిలో నాణ్యమైన పప్పు రాకపోవడం వల్ల జిల్లాకు కేవలం 60 శాతం కందిపప్పు మాత్రమే కేటాయించారు. అందులో జిల్లాలోని గోపాలపురం, నిడదవోలు, కోరుకొండ, బొమ్మూరు, బిక్కవోలులో ఐదు ఎంఎల్ పాయింట్లు ఉన్నాయి. ప్రభుత్వం పౌరసరఫరా సంస్థకు కేటాయిస్తే, అక్కడ నుంచి ఎంఎల్ పాయింట్లకు సరుకు వస్తుంది. అక్కడ నుంచి మండలాల వారీ ఆయా రేషన్ డిపోలకు సరఫరా అవుతుంది. అయితే వివిధ కారణాల వల్ల జనవరిలో కూడా జిల్లాకు కేవలం 60 శాతం మాత్రమే కేటాయించారు. అందులో సుమారు దాదాపు ఎనిమిది లారీలలో వచ్చిన సుమారు 200 టన్నుల కందిపప్పు పాడైపోవడంతో తిరిగి పంపించారు.ఈ పరిస్థితులలో జిల్లాలో కేవలం 30 శాతం నుంచి 35 శాతం మంది లబ్ధిదార్లకే అందింది. జిల్లాకు కేటాయించిన పప్పులో ఐసీడీఎస్‌కు, గర్భవతులకు కూడా పప్పు పంపిణీ చేయ వలసి ఉంది. ప్రస్తుతం అధికారులు అంగన్‌వాడీలు, గర్భవతులకు పప్పు కొరత లేకుండా చూడగలుగుతున్నారు. కానీ జిల్లాలో రేషన్‌కార్డుల ద్వారా పొందే వారికి మాత్రం ఇవ్వలేకపోతున్నారు. జిల్లాలోని 5 లక్షల 75 వేల మంది రేషన్‌కార్డుదారులకు ఒక్కో కార్డుకు ఒక కేజీ వంతున పంపిణీ చేయవలసి ఉంది. కానీ కేవలం 30 శాతం మందికే పప్పు అందడంలో అందరూ పండగ రోజున అసంతృప్తి చెందారు.. కొంత పప్పు మాత్రమే రావడం వల్ల పండగ ముందు రోజులలో కొంతమందికి బాగానే సరిపెట్టారు. తర్వాత రోజులలో ఎవరికి పప్పు అందలేదు. గతనెల కోటా కింద ఆలస్యంగా సుమారు 60 టన్నుల వరకూ కందిపప్పు వచ్చింది. అందులో అంగన్‌వాడీలు, గర్భిణులకు సరిపెట్టగా, మిగిలినది ఫిబ్రవరి నెలలో పంపిణీ చేయనున్నారు. గతనెలలో కందిపప్పు పూర్తిగా అందని రాజానగరం మండలంలో వచ్చేనెలలో పూర్తిగా పంపిణీ చేయనున్నారు. జిల్లాలో మిగతా చోట్ల గత నెలలో అందని వారికి వచ్చేనెలలో ఉన్నంత మేర పంపిణీ చేసే ప్రయత్నాల్లో అధికారులు ఉన్నారు. గతనెల కోటా కింద ఇంకా 110 టన్నులు పప్పు రావలసి ఉంది. అదికాక ఫిబ్రవరి కోటా కింద 500 టన్నులు రావాల్సి ఉంది. సాధారణంగా ప్రతినెలా 1వ తేదీ నుంచి 15లోపు ఎంఎల్ పాయింట్లకు పప్పు వస్తుంది. దానిని ప్రతినెలా 20 నుంచి 25 వరకు ఒక విడతగా, 25 నుంచి 30 లోపు రెండో విడతగా రేషన్ డీలర్లు, ఎండీయూ వాహనాలకు అందిస్తారు. ఈనెల ఇంతవరకూ జిల్లా కు కేటాయింపులు రాకపోవడంతో వచ్చేనెలలో కేవలం 20 శాతం మందికి పప్పు అందేటట్టయినా చేయాలనే ప్రయత్నాలు చేస్తున్నారు.

'ఆదిత్య'లో జాతీయస్థాయి

ఐడియా థాన్ ప్రారంభం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆదిత్య ప్రో ఛాన్సలర్ సతీష్‌రెడ్డి

గండేపల్లి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): గండేపల్లి మండలంలోని సూరంపాలెం ఆదిత్యలో ఈనెల 30, 31 తేదీల్లో ఐడియాథాన్ జాతీయ స్థాయి కార్యక్రమం ఘనంగా నిర్వహిస్తున్నట్టు డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమం ఏఐసీటీ హబ్ ఫౌండేషన్, టెక్కీబాట్ సంస్థల భాగస్వామ్యంతో జరగనుంది. రెండురోజుల ఐడియా థాన్‌లో దేశ వ్యాప్తంగా 300కు పైగా విద్యార్థులు పాల్గొంటున్నారు. కార్యక్రమంలో విద్యార్థులు పరిశ్రమ 4.0 సాంకేతికతలను ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, రోబోటిక్స్, ఆటోమొబైల్ ఆటోమేషన్ మొదలైన వాటిని ఉపయోగించి వాస్తవ ప్రపంచ సమస్యలను పరిష్కరించేందుకు తమ సృజనాత్మక ఆలోచనలు ప్రదర్శిస్తున్నారు. ఈ వేడుక ద్వారా దేశంలో ఉన్న ప్రతిభా లక్షణాలను, జ్ఞానాన్ని, సాంకేతికతలను సమీకరించి, యువతకు పరిశ్రమ 4.0 నైపుణ్యాలను నేర్పించడం లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తామని ఆదిత్య ప్రో ఛాన్సలర్ డాక్టర్ సతీష్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా రాజేష్‌కుమార్ అడ్ల టీహబ్ సీఈవో, టెకీబోట్ ఫౌండర్ సీఈవో నల్లమిల్లి వెంకటరెడ్డి హాజరయ్యారు.

నేనే ముందు..



జాతీయ రహదారి ఎర్రకోనేరు వద్ద భారీ లోడుతో వెళుతున్న ట్రాలీ లారీ

- జాతీయ రహదారిపై భారీ లోడ్‌తో ట్రాలీ లారీ
- రెండు కిలోమీటర్ల మేర నిలిచిపోయిన వాహనాలు

తుని రూరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపైకి 42 అడుగుల వెడల్పు, 42 అడగుల ఎత్తుతో కూడిన పెద్ద బాయిలర్‌తో జాతీయ రహదారిపై ఒక వాహనం రావడంతో వెనుక ప్రయాణించే వాహనాలు పూర్తిగా నిలిచిపోయిన పరిస్థితులు ఎదురయ్యాయి. విదేశాల నుంచి కాకినాడ పోర్టుకి దిగుమతి అక్కడ నుంచి ఒడిశాకి ఒక భారీ ట్రాలీ లారీపై లోడ్ అయ్యి ఒడిశా వైపుకి 16వ నెంబరు జాతీయ రహదారి మీదుగా బయలుదేరింది. హైవే అథారిటీ సిబ్బంది రోజుకు 18 కిలోమీటర్ల మేర ప్రయాణించేందుకు అనుమతులు జారీ చేయడంతో వివిధ శాఖల అధికారులుసమన్వయంతో ఈ వాహనాన్ని ముందుకు నడిపించారు. ఇది రహదారిపై నడిచే క్రమంలో వెనుక ఉన్న వాహనాలు ముందుకు కదిలేందుకు వీలు లేకపోవడంతో పెద్దఎత్తున ట్రాఫిక్‌జామ్ అయ్యింది. రెండు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోవడంతో వాహనదారులు, అధి కారులు అసహనం వ్యక్తంచేశారు. ఈ వాహ నం రాకతో జాతీయ రహదారిపై కరెంటు నిలిచిపోవడంతో ప్రజలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి.

రెడ్‌క్రాస్ రాష్ట్ర శాఖ చైర్మన్‌గా వైడీ రామారావు



రామారావును సత్కరిస్తున్న దృశ్యం

కార్పొరేషన్(కాకినాడ), జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రశాఖ నూతన చైర్మన్‌గా కాకినాడ జిల్లాశాఖ చైర్మన్‌గా ఉన్న వైడీ రామారావు ఎన్నికయ్యారు. విజయవాడలో జరిగిన రాష్ట్ర కార్య నిర్వాహకవర్గ సమావేశంలో రామారావును సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇప్పటివరకు చైర్మన్‌గా ఉన్న డాక్టర్ ఎ.శ్రీధర్‌రెడ్డి రాజీనామా కారణంగా ఏర్పడిన ఖాళీలో రామారావు పదవీ బాధ్యతలు స్వీకరించారు. గత 26 సంవత్సరాలుగా రెడ్‌క్రాస్‌తో అనుబంధం కలిగి 8 సంవత్సరాలుగా ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా శాఖ, కాకినాడ జిల్లా శాఖ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న రామారావు అత్యున్నత జాతీయ రెడ్‌క్రాస్ పురస్కారం రాష్ట్రపతి బంగారు పతకాన్ని, రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ జిల్లా శాఖ పురస్కారాలను పొందిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా వైడీ రామారావును రెడ్‌క్రాస్ సభ్యులు, ప్రముఖులు అభినందించారు.

2న హాకీ మహిళా జిల్లా జట్టు ఎంపిక

కాకినాడఅర్బన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి); రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు హాకీ ఉమ్మడిజిల్లా మహిళా జట్టు ఎంపిక ఫిబ్రవరి 2న కాకినాడ డీఎస్‌ఏ మైదానంలో నిర్వహిస్తారని హాకీ సంఘ జిల్లా కార్యదర్శి నంబూరి శ్రీనివాసరావు తెలిపారు. ఎంపికైనవారు వచ్చేనెల 8నుంచి నెల్లూరులో జరిగే సీనియర్ మహిళా హాకీ రాష్ట్ర చాంపియన్‌షిప్‌లో పాల్గొంటారన్నారు.క్రీడాకారులు 2న హాకీ స్టేడియంలో హాజరుకావాలన్నారు.

అంతర్జాతీయ సదస్సులో పిఠాపురం కవికి సత్కారం

పిఠాపురం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): చెన్నైలో జరిగిన అంతర్జాతీయ తెలుగు సదస్సులో పిఠాపురం కవికి సత్కారం లభించింది. మద్రాసు యూనివర్సిటీలోని మద్రాసు తెలుగుశాఖ ఆధ్వర్యంలో మెరీనా ఆవరణలో రెండు రోజుల పాటు ఈ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు పిఠాపురం పట్టణానికి చెందిన ప్రముఖ కవి, విమర్శకు డు, రచయిత చిందాడ చిన్నోడు హాజరయ్యారు. ఇందులో భాగంగా జరిగిన తొలి తరం ముస్లిం కవి, ఆధ్యాత్మికవేత్త, స్వాతంత్ర్య సమరయోధుడు బ్రహ్మర్షి ఉమర్‌ఆలీషా సాహిత్యం-బహుముఖీనత సదస్సులో డాక్టర్ ఉమర్ ఆలీషా వారి ఖండకావ్యములు-సామాజిక సందేశం అనే అంశంపై పత్ర సమర్పణ చేశారు. ఇదే అంశంపై సదస్సులో ప్రసంగించారు.



చెన్నైలో జరిగిన అంతర్జాతీయ తెలుగు సదస్సులో పిఠాపురం కవి చిందాడ చిన్నోడును సత్కరిస్తున్న దృశ్యం

ఈ సందర్భంగా చిన్నోడును మద్రాసు యూనివర్సిటీ తెలుగు శాఖాధిపతి ఆచార్య విస్తాలి శంకరరావు తదితరులు సత్కరించారు. ఈ సందర్భంగా చిన్నోడును సదస్సులో పాల్గొన్న పీఠాధిపతి డాక్టర్ ఉమర్‌ఆలీషా, సినీ గేయ రచయిత భువనచంద్ర, వ్యాసిలి వసంతకుమార్, డాక్టర్ పాండురంగం కాళియప్ప తదితరులు అభినందించారు.

క్యాంపస్ ఇంటర్వ్యూలో ఆరుగురు ఏపీటీ విద్యార్థులకు ఉద్యోగాలు

- ఒక్కొక్కరికీ రూ.9.02 లక్షల వార్షిక వేతనం



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ జనార్ధనరావు

కాకినాడరూరల్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): కాకినాడ జగన్నాధపురంలోని ఆంధ్రా పాలిటెక్నిక్ కళాశాలలో టెక్సాస్ ఇనుస్ట్రుమెంట్స్ నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఆరుగురు విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ నల్లి జనార్ధనరావు తెలిపారు. ఒక్కొక్కరికీ రూ.9.02లక్షల వార్షికవేతనం లభించనుందన్నారు. పి.సాయిఅలేఖ్య, ఆర్.అనూష, జి.సిద్దు, ఏ.లక్ష్మీగణపతి, వి.వంశీకృష్ణ, వి.సిద్ధార్థలు ల్యాబ్‌టెక్నీషియన్ ఉద్యోగాలకు ఎంపికయ్యారని తెలిపారు.ఇంజనీరింగ్ విద్యార్థులకు ఇంతటివేతనంతో ఉద్యోగాలు లభించడంలేదన్నారు. ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ విభాగంలో విద్యార్థులు ఈఘనత సాధించారన్నారు. విద్యార్థులను టీపీవో, ప్రిన్సిపాల్ అభినందించారు.

డిప్యూటీ సీఎం పవన్‌ను కలిసేందుకు పాదయాత్ర

గొల్లప్రోలు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ను కలిసేందుకు శ్రీకాకుళంజిల్లా రణస్థలం మండలం బవరాజుపాలెం నుంచి ఒక కుటుంబం పాదయాత్రగా మంగళగిరి బయలుదేరారు. వీరు గురువారం సాయంత్రం గొల్లప్రోలు టోల్‌ప్లాజా సమీపంలోని వైజంక్షన్ వద్దకు చేరుకున్నారు. భార్యాభర్త కలిసి ఈ పాదయాత్ర చేపట్టారు. బవరాజుపాలెం దారు బంద ట్యాంకు సర్వే నెంబరు 10లో 1.50 ఎకరాల భూమికోసం తమ కుటుంబం 35 ఏళ్లుగా పోరాటం చేస్తున్నదని, మాకు మీరే న్యాయం చేయాలంటూ ఉన్న ఫ్లెక్సీని పట్టుకుని వారు పాదయాత్ర నిర్వహిస్తున్నారు. పవన్‌ను రెండుసార్లు కలిశామని, ఈసారి మంగళగిరిలో స్వయంగా కలిసి మరోమారు విన్నవించనున్నట్లు వారు తెలిపారు. మీ ఆదేశాలను కూడా రెవెన్యూ అధికారులు పాటించడంలేదని ఫ్లెక్సీలో పేర్కొన్నారు.



డిప్యూటీ సీఎం పవన్‌ను కలిసేందుకు మంగళగిరి పాదయాత్రగా వెళుతున్న కుటుంబం

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

అల్లవరం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం బోడసకుర్రు వైనతేయ వారధిపైనుంచి మంగళవారం గోదావరిలో దూకిఆత్మహత్యకు పాల్పడిన యువకుడి మృతదేహం పాశర్లపూడి వైపున లభ్యమైందని పోలీసులు తెలిపారు. మలికిపురం మండలం రామరాజులంకకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి జవ్వాది కృపాకిరణ్(25) చెన్నైలోని విప్రో కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. ఇటీవల సొంతూరు వచ్చిన అతడు మంగళవారం బోడకుర్రు బ్రిడ్జిపై తన యాక్సిస్ స్కూటర్ వదిలి గోదావరిలో దూకేశాడు. మృతుడి తండ్రి నాగేశ్వరరావు గతంలో మృతి చెందగా తల్లి సీతకు కృపాకిరణ్ ఒక్కడే కుమారుడు. అతడి మృతదేహన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని అమలాపురం ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబీకులకు అప్పగించామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ జి.హరీష్‌కుమార్ తెలిపారు.

రైలులో ప్రయాణికురాలి బంగారం గల్లంతు

సామర్లకోట, జనవరి 30(ఆంధ్రజ్యోతి): లింగంపల్లి నుంచి కాకినాడకు ఎక్స్‌ప్రెస్ రైలులో వస్తుండగా 8 గ్రాముల బంగారు గాజు పోయిందని ఓ ప్రయాణికురాలు సామర్లకోట రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేసింది. చక్రవర్తుల షణ్ముఖరాణి అనే మహిళ గురువారం లింగంపల్లి-కాకినాడ రైలులో ప్రయాణించింది. ప్రయాణంలో చేతికిఉన్న 2బంగారు గాజులను హ్యాండ్ బ్యాగ్‌లో వేసుకుని ఉదయం సామర్లకోటలో రైలు దిగింది. బ్యాగులో చూసుకోగా ఒక గాజు మాత్రమే ఉన్నట్లు గుర్తించి అప్పటికి కాకినాడకు చేరుకున్న రైలులో తాను ఎక్కిన బోగీ గాలించినా బంగారు గాజు ఆచూకీ కనిపించలేదని, 8 గ్రాముల బంగారు గాజు విలువ రూ.80వేలు ఉంటుందని ఫిర్యాదులో పేర్కొంది.

భూముల విలువలకు రెక్కలు



- ఫిబ్రవరి 1 నుంచి అమలుకు సన్నాహాలు
- జాతీయ రహదారులు, ఏడీబీ రోడ్డుకు ఇరువైపులా భూముల ధరల పెంపు
- 10నుంచి 20శాతం వరకూ పెంపుదలకు నిర్ణయం

సామర్లకోట, జనవరి 30(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం భూములు, స్థలాల మార్కెట్ విలువలను పెంచేందుకు కసరత్తు పూర్తి చేసింది. ఫిబ్రవరి 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా పెంచిన భూముల విలువలను కచ్చితంగా అమలు చేయాలని జిల్లాలోని అన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు స్టాంపులు, రిజిస్ట్రేషన్లశాఖ కమిషనర్, ఐజీ కార్యాలయంనుంచి ఉత్తర్వులందాయి.

నెల క్రితం వాయిదా

డిసెంబరు నెలలో రాష్ట్ర ఐజీ కార్యాలయం నుంచి అందిన ఆదేశాల మేరకు ఆయా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్థానిక సంస్థల కమిషనర్లతో వార్డులవారీగా భూముల విలువలు పెంపుదలకు కార్యాచరణ పూర్తిచేశారు. జనవరి 1నుంచే పెంపుదల విలువలను అమలుకు అప్పట్లో నిర్ణయించినా ప్రభుత్వం వాయిదా వేసింది. తిరిగి నెలరోజుల అనంతరం భూముల విలువలు పెంపుదలకు తాజాగా ప్రభుత్వం తెరపైకి తీసుకువచ్చి ఫిబ్రవరి 1నుంచి అమలుకు ప్రకటన చేశారు. గతంలో స్పెషల్ రివిజన్‌లో అధిక పెంపును సవరిస్తూ స్థిరాస్తిదారులకు భారం కాని విధంగా 10 నుంచి 20 శాతం మేర మాత్రమే భూముల ధరలు పెంచి ఫిబ్రవరి 1 నాటికి పెంచిన ధరలతో రిజిస్ట్రేషన్లకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడమే తరువాయిగా మారింది.

10శాతంపైనే పెంపునకు నిర్ణయం

బహిరంగ మార్కెట్లో భూములకు విలువలు అధికంగా ఉన్నప్పటికీ రిజిస్ట్రేషన్ విలువలు చాలా తక్కువగా ఉంటాయి. దీంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండిపడుతోంది. ప్రభుత్వం ప్రజావసరాలకోసం భూములను కొనుగోలు చేసే సందర్భాల్లో భూములు అమ్మేవారు తీవ్రంగా నష్టపోతున్నారు. దీంతో ఈసారి మార్కెట్ విలువలను జిల్లాలో 10శాతం నుంచి 35శాతం పెంచాలని నిర్ణయించినట్లు సమాచారం. అందుకు తగ్గట్లుగా రిజిస్ట్రేషన్‌శాఖ అధికారులు నివేదికలు తయారుచేశారు. కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన జిల్లాలోని అందరు మున్సిపల్ కమిషనర్లతోను, పంచాయతీ ఉన్నతాధికారులతోను గత డిసెంబరులో 19న కాకినాడలో సమావేశం నిర్వహించారు.

ఆ భూముల ధరలు పెంపు

చాన్నాళ్లుగా భూముల మార్కెట్ విలువలు పట్టణ ప్రాంతాలు, కమర్షియల్‌గా రియల్ ఎస్టేట్ వ్యాపారాలు జరిగే ప్రాంతాల్లో మాత్రమే భూములు, స్థలాల ధరలు పెంపు జరుగుతోంది. ప్రతిఏటా జనవరి, మార్చి నెలల్లో ధరలు పెంచడం రిజిస్ట్రేషన్ శాఖకు ఆనవాయితీ. కానీ ఈ దఫా గత ప్రభుత్వ హయాంలో అధిక పెంపును సవరిస్తూ జాతీయ రహదారులు, ఏడీబీ రోడ్డులకు ఇరువైపులా భూముల విషయంలో ధరల పెంపుదలకు ఉమ్మడి తూర్పు జిల్లాలో పెద్దకసరత్తు చేసినట్లు తెలుస్తోంది. జాతీయ రహదారులు, ఏడీబీ రోడ్డుల్లో ఇరువైపులా భూముల్లో అనధికారికంగా కమర్షియల్‌గా కోట్ల రూపాయలతో నిర్మాణాలు సాగుతున్నాయి. భూముల ధరలు ఎకరానికి రూ.60 నుంచి రూ.80 లక్షలకు మించేవికావు. ఇదే భూములను కమర్షియల్‌గా లెక్కిస్తే బహిరంగ మార్కెట్‌లో ఎకరం ధర అక్షరాలా రూ.5కోట్ల నుంచి రూ.8కోట్ల పై మాటే. దీనివల్ల రిజిస్ట్రేషన్‌శాఖ రాబడికి పెద్ద ఎత్తున గండిపడుతోంది. రైతులకు తమ వ్యక్తిగత అవసరాలకోసం బ్యాంకుల్లో అధిక మొత్తంలో రుణాలు దక్కని పరిస్థితిని కూటమి ప్రభుత్వ పెద్దలకు విన్నవించుకున్నట్లు తెలుస్తోంది.

ఎల్‌పీ నెంబర్లతో రిజిస్ట్రేషన్ల రాబడికి..

జగనన్న భూరక్ష పేరిట భూముల రీసర్వే తప్పుల తడకగా సాగింది. రైతులకు సంబంధించిన భూములకు సర్వే నెంబర్ల స్థానంలో ల్యాండ్ పార్సిల్(ఎల్‌పీ) నెంబర్లు కేటాయించారు.ఆభూమిని రైతు తన ఇబ్బందుల రీత్యా కొంత అమ్ముకుంటే ఆ భూమిని కొన్న వ్యక్తులకు భవిష్యత్తులో రెవెన్యూ రిజిస్ట్రేషన్ల కష్టాలు తప్పడం లేదు. దీంతో రీసర్వేలో అనాలోచిత నిర్ణయాలతో ఎల్‌పీ నెంబర్లు కేటాయించిన జిల్లాలో కొన్ని గ్రామాల్లో స్థిరాస్థిదారులు పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. ఈ సమస్యలను పరిష్కారానికి అధికారులు ముందుకు రాలేదు. రెవెన్యూసదస్సుల్లో ఎల్‌పీ నెంబర్ల విధానం సవరణలపై ఫిర్యాదులందినట్లు తెలుస్తోంది.

ఫిబ్రవరి 1 నుంచి..

జిల్లాలో అన్నిముఖ్యమైన ప్రాంతాల్లో సెంటు (48 చదరపు గజాలు) భూమి విలువ బహిరంగ మార్కెట్లో రూ.వేలల్లో, లక్షల్లో ఉంటుంది. కానీ, ఎకరా భూమి రూ.5కోట్ల వరకూ పలుకుతోంది. రిజిస్ట్రేషన్‌శాఖ మార్కెట్ విలువలు మాత్రం రూ.వేలు, లక్షలు దాటడం లేదు. దీంతో భూములు మార్కెట్ విలువల పెంపుపై ప్రభుత్వం దృష్టిసారించింది. జిల్లాలో చాలా ప్రాంతాల్లో వ్యవసాయ భూములు, ఇళ్ల స్థలాలుగా మార్పు చెందాయి. సాధారణంగా పట్టణ ప్రాంతాల్లో ఆగస్టు 1న, గ్రామీణ ప్రాంతాల్లో రెండేళ్లకోసారి రిజిస్ట్రేషన్ విలువలు పెంచుతారు. ఈసారి పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోను ఈ విలువలు పెరగనున్నాయి. గత డిసెంబరు నెల 20న భూముల విలువల పెంపుదల పత్రాలను ఆయా ప్రభుత్వ కార్యాలయాల నోటీసు బోర్డుల్లో ప్రదర్శించారు. ప్రజల అభిప్రాయాలను సైతం సమీకరించింది. ఫిబ్రవరి 1 నుంచి పెంచనున్న మార్కెట్ విలువలను అమలులోకి తీసుకురానున్నారు. రాజానగరం ఏడీబీ రోడ్డు నుంచి సామర్లకోట మండలం అచ్చంపేట జంక్షన్ వరకూ రోడ్డుకు ఇరువైపులా ఎకరా భూమి బహిరంగ మార్కెట్‌లో రూ.8కోట్లనుంచి రూ.10 కోట్ల వరకూ ధర పలుకుతుంది. ప్రభుత్వ ధర మాత్రం రూ.60లక్షలనుంచి రూ.80లక్షల వరకూ మాత్రమే ఉంది. పెద్దాపురం ఏడీబీ రోడ్డులో సైతం ఎకరాకు రూ.25లక్షలలోపు మాత్రమే ఉంది. ఇదే రీతిలో పలు పట్టణ ప్రాంతాల్లో కూడా చదరపు గజాల మార్కెట్ ధరలు రూ.9వేలలోపు మాత్రమే ఉండగా మూడు రెట్లు అదనంగా ధరలు పలకడం గమనార్హం.

టిస్‌లో తప్పుల మార్పుకు మరో అవకాశం

- నేటి సాయంత్రంలోపు చేసుకోవాలి
- కాకినాడ జిల్లా డీఈవో రమేష్

కాకినాడరూరల్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): పాఠశాల డైరెక్టర్ ఆదేశాల ప్రకారం కాకినాడ జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులంతా వారి టిస్(టీఐఎస్) పూర్తి వివరాలను www.cse.ap.gov.in వెబ్‌సైట్‌లో వ్యక్తిగత హాజరు యాప్ లాగిన్ ద్వారా నమోదు చేసుకున్నారు. ఆ వివరాల్లో ఏమైనా తప్పులుంటే మార్పులు చేసుకోవడానికి పాఠశాల విద్యాశాఖ మరో అవకాశం కల్పించినట్లు డీఈవో పి.రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఉపాధ్యాయులంతా వారి వివరాల్లో తప్పులేమైనా ఉంటే శుక్రవారం సాయంత్రంలోపు మార్పులు చేసుకోవాలన్నారు.

సత్యదేవుడి హుండీల ఆదాయం రూ.1.33కోట్లు

అన్నవరం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధిలో భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకలను గురువారం లెక్కించగా రూ.1,33,16,044 నగదు, 62 గ్రాముల బంగారం, 525 గ్రాముల వెండి లభించాయి. వీటితోపాటు యుఎస్‌ఏకు చెందిన 369 డాలర్లు, ఇండోనేషియా 1200000 ఇండోనేషియన్ రుపియా, ఆస్ట్రేలియా 100 డాలర్లు, సింగపూర్ 50 డాలర్లు, ఇంగ్లాండ్ 65 పౌండ్స్‌ను భక్తులు హుండీల్లో వేశారు. లెక్కింపును ఈవో వీర్ల సుబ్బారావు, చైర్మన్ రోహిత్ పర్యవేక్షించగా సిబ్బంది లెక్కించారు. 30రోజులకు ఈ ఆదాయం లభించగా సరాసరిన భక్తులు రోజుకు రూ.4.43లక్షలు సమర్పించినట్లు అధికారులు వెల్లడించారు.

వివాహేతర సంబంధం నేపథ్యంలో వ్యక్తి హత్య



చంద్రశేఖర్ మృతదేహం

- మరో వ్యక్తితో కలిసి సహజీవనం చేస్తోన్న ప్రియురాలు
- చిరునామా తెలుసుకుని వచ్చి ఘర్షణ పడిన ప్రియుడు
- ఇనుప దస్తాతో మోది కడతేర్చిన యువతి
- కాకినాడలో ఘటన

కాకినాడ క్రైం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధం నేపథ్యంలో ఓ వ్యక్తిని ప్రియురాలే కడతేర్చిన సంఘటన గురువారం కాకినాడలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండ మండలం సిద్ధాంతంలోని చినమల్లంకు చెందిన గుడాల చంద్రశేఖర్‌స్వామి(30) రావులపాలెంలో ఉంటూ వ్యవసాయ కూలీగా పని చేసేవాడు. ఈ క్రమంలో అతనికి రావులపాలేనికి చెందిన 25ఏళ్ల మునిస్వామిలావణ్యతో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం కాస్తా సహజీవనానికి దారి తీసింది. ఆమెకు అప్పటికే చిత్తూరుజిల్లాకు చెందిన బాలు అనే వ్యక్తితో వివాహమై ఇద్దరు పిల్లలు పుట్టాక విడిపోయారు. కాగా చంద్రశేఖర్‌స్వామికి తెలియకుండా లావణ్య ఆర్టీసీ డ్రైవర్‌గా పనిచేసే మరో వ్యక్తి లోవరాజుతో సహజీవనం చేస్తూ అతడితో కలిసి గుట్టుచప్పుడు కాకుండా రెండునెలల క్రితం కాకినాడలోని డైరీఫారం సెంటర్ స్వర్ణాంధ్రకాలనీలోని టిడ్కో ఇంటిని అద్దెకు తీసుకున్నారు. లావణ్య కాకినాడలో మరో వ్యక్తితో సహజీవనం చేస్తోందని ఆ ఇంటి చిరునామా తెలుసుకుని చంద్రశేఖర్ స్వామి బుధవారం రాత్రి ఆ ఇంటికి వచ్చాడు. అక్కడ లావణ్యతో ఘర్షణ పడ్డాడు. అలా తెల్లవారుజాము వరకు ఇద్దరి మధ్య తీవ్రస్థాయిలో ఘర్షణ వాతావరణం నెలకొంది. ఈ క్రమంలో విషయం ఇంతవరకు వచ్చాక తనను చంద్రశేఖర్ అంతం చేస్తాడని గ్రహించిన లావణ్య మసాల దంచే ఇనుప అమస్ దస్తాతో చంద్రశేఖర్ తలపై బలంగా విచక్షణారహితంగా మోదడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం ఆమె పరారైంది. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న పోలీసులు చంద్రశేఖర్ మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. మృతుడు తండ్రి వెంకన్న ఫిర్యాదు మేరకు పోర్ట్ సీఐ సునీల్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అప్పులు చేసి.. తీర్చలేక..



ఆత్మహత్యకు పాల్పడిన వరలక్ష్మి మృతదేహం

- పురుగుల మందు సేవించి ఆపై చికిత్స పొందుతూ.. ఆస్పత్రి భవనంపై నుంచి దూకి ఆత్మహత్య
- తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలంలో ఘటన

అనపర్తి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ఆమెది ఓ మధ్య తరగతి కుటుంబం.. అయితేనేం సమాజంలో గొప్పగా బతకాలని కలలు కని.. ఇంట్లో ఏ వేడుక జరిగినా తలకు మించి అప్పులు చేసేది. దాన్ని తీర్చే ధైర్యం లేకపోవడంతో చివరకు తనువు చాలించింది. తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలం ఊలపల్లికి చెందిన వాశిరెడ్డి వరలక్ష్మి(32) స్థానికంగా ఓ ప్రైవేట్ పాఠశాలలో పనిచేస్తుంది. ఈమెకు భర్త, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆమె తన కుమార్తె వేడుక చేసేందుకు స్థోమతకు మించి అప్పులు చేసింది. ఆ అప్పులు తీర్చలేక, ఇచ్చిన వారికి సమాధానం చెప్పలేక మధనపడుతూ మంగళవారం పురుగులమందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడడంతో బంధువులు ఆమెను అనపర్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు సకాలంలో వైద్యమందించి ప్రాణాలను నిలబెట్టారు. చివరకు గురువారం ఉదయం వేకువజామున 4గంటల సమయంలో ఆమె చికిత్స పొందుతున్న ఆస్పత్రి భవనంపైనుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడగా, వెంటనే అప్రమత్తమైన సిబ్బంది కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ ఆమె చికిత్స పొందుతూ మృతిచెందింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు అనపర్తి అడిషనల్ ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపారు.

పశువుల ఆరోగ్య పరిరక్షణకే ప్రత్యేక శిబిరాలు

పశుసంవర్ధక శాఖ స్పెషల్ ఆఫీసర్ రాధాకృష్ణ



ప్రదర్శనలో ఉన్న పశువులను పరిశీలిస్తున్న అధికారులు

కిర్లంపూడి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): పాడి సంపద పరిరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషిచేస్తున్నాయని పశుసంవర్ధక శాఖ స్పెషల్ ఆఫీసర్ రాధాకృష్ణ అన్నారు. కిర్లంపూడి మండలంలోని గోనేడ గ్రామంలో గురువారం లేగ దూడల ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. కాకినాడ జిల్లా జేడీ రామస్వామి ఆధ్వర్యంలో ఉపసంచాలకులు డాక్టర్ అంబేడ్కర్, పెద్దాపురం సంచాలకులు రామస్వామి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి స్పెషల్ ఆఫీసర్ రాధాకృష్ణ హాజరయ్యారు. పశువైద్యాధికారి నయీమ్ ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. 36 లేగదూడలను ప్రదర్శనలో ఉంచారు. ఈ ప్రదర్శనలో ఎంపికైన వాటికి బహుమతులు అందించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ పశుసంపదను రైతులు పెంచుకోవాలన్నారు. రైతులకోసం ప్రభుత్వం 23,500 గోకుల షెడ్‌లను మంజూరు చేసిందన్నారు. పశువులకు ఇచ్చే ఇంజక్షన్ ధర రూ.1350కుగాను పాడి రైతులకు రూ.500కే అందిస్తున్నామన్నారు. 50 సెంట్లు భూమిలో రెండేళ్లపాటు పచ్చగడ్డి పెంచితే సంవత్సరానికి రూ.32వేల చొప్పున రూ.64వేలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తాయన్నారు. పాడిపశువులకు ఇన్సూరెన్స్ అందిస్తున్నామని, రైతులు రూ.400 కడితే ప్రభుత్వం రూ.1200 జమచేసి మూడేళ్లపాటు ఇన్సూరెన్స్ వర్తించేస్తుందని తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మండపేట, జనవరి 30(ఆంధ్రజ్యోతి): మద్యంలో యాసిడ్ కలుపుకుని సేవించిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన ఇది. మండపేట పోలీసుల కథనం ప్రకారం.. కాకినాడ డైరీఫారం సెంటరు వద్ద నివాసం ఉంటూ కోరమండల్ సంస్థలో పని చేసే ఓలేటి గంగాధరం(50) బుధవారం మండపేటలోని బూరుగుంట చెరువు వద్దకు వచ్చాడు. అక్కడ మద్యంలో యాసిడ్ కలుపుకుని సేవించడంతో వెంటనే అపస్మారక స్థితికి చేరుకున్నాడు. స్థానికులు దీన్ని గమనించి 108 వాహనంలో మండపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ గొడవల కారణంగా గంగాధరం దీనికి పాల్పడినట్టుగా భావిస్తున్నారు. గురువారం చికిత్స పొందుతూ కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో మృతి చెందినట్టు పోలీసులు చెప్పారు. ఆస్పత్రి వర్గాల సమాచారం మేరకు అతడి భార్యకు సమాచారం ఇచ్చారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పట్టణ ఏఎస్ఐ చిన్నారావు తెలిపారు.

మహిళా పోలీసుపై హోంగార్డు దాడి

ద్రాక్షారామ, జనవరి 30(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలం వెల్ల మహిళా పోలీసు తనపై హోంగార్డు దాడి చేశాడని ఇచ్చిన ఫిర్యాదు మేరకు ద్రాక్షారామ పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మహిళా పోలీసు వైదాడి ఉమామహేశ్వరి, హోంగార్డు కుమార్‌రాజువద్ద రూ.లక్ష అప్పు తీసుకున్నారు. ఈ నేపథ్యంలో రూ.లక్ష ఒకసారి, రూ.14వేలు ఒకసారి ఆమె చెల్లించింది. ఈనెల 16న అతడు డబ్బులు అడుగుతూ జుట్టు పట్టుకుని బూతులు తిడుతూ దాడి చేశాడని పోలీసులు తెలిపారు. ద్రాక్షారామ ఎస్ఐ ఎం.లక్ష్మణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేటి రంపచోడవరం జాబ్‌మేళా రద్దు

పాడేరురూరల్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడప్, జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో ఈనెల 31న అల్లూరి సీతారామరాజు జిల్లాలోని రంపచోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించాల్సిన జాబ్‌మేళాను రద్దు చేస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారిణి డాక్టర్ పి.రోహిణి గురువారం తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలు నేపథ్యంలో జాబ్‌మేళాను రద్దు చేశామన్నారు.

కాకినాడలో వ్యక్తి అనుమానాస్పద మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కాకినాడ క్రైం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ఓ గుర్తు తెలియని వ్యక్తి ఒంటిపై గాయాలతో అనుమానాస్పదంగా మృతి చెందిన గురువారం కాకినాడలో చోటు చేసుకుంది. కాకినాడ డైరీఫాం సెంటర్‌లోని పర్లోవపేట టిడ్కో గృహ సముదాయంవద్ద గురువారం ఉదయం ఓ గుర్తు తెలియని 30ఏళ్ల పురుషుడు విగతజీవిగా రోడ్డు పై పడి ఉన్నాడు. కాగా ఆ విషయాన్ని స్థానిక వీఆర్‌వో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అనంతరం సంఘటనా స్థలానికి పోర్టు ఎస్‌హెచ్ఓ సునీల్‌కుమార్ చేరుకుని మృతదేహన్ని పరిశీలించారు. మృతుడి గుండెలపైన, తల వెనుక భాగంలోను గాయాలు ఉండడంతో పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. గురువారం తెల్లవారుజాము సమయంలో మృతుడు తూలుతూ నడుచుకుంటూ వెళ్లినట్లు స్థానికులు తెలిపారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. పోర్టు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కల్యాణోత్సవాల్లో భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలి



అంతర్వేది స్వామివారి వార్షికోత్సవంపై మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

- అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్
- అంతర్వేదిలో లక్ష్మీనరసింహస్వామి కల్యాణ మహోత్సవాలపై అధికారులతో సమీక్ష

అంతర్వేది, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరి 4వ తేదీ నుంచి 13వ తేదీ వరకు అంతర్వేది పుణ్యక్షేత్రంలో జరిగే శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి దివ్య తిరు కల్యాణ మహోత్సవాలకు విచ్చేసే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తూ ఉత్సవాలను అత్యంత వైభవోపేతంగా అధికారులు సమన్వయంతో నిర్వహించాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ జిల్లా స్థాయి అధికారులను ఆదేశించారు. అంతర్వేది ఆలయ పరిసర ప్రాంతాలైన బీచ్, ఫెర్రీ పాయింట్లను పరిశీలించి అనంతరం కల్యాణ వేదిక వద్ద జిల్లాస్థాయి అధికారులతో ఉత్సవాల ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మహేష్‌కుమార్ మాట్లాడుతూ సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు అసౌకర్యం కలుగకుండా పూర్తిస్థాయిలో అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. స్వామివారి ఆలయ ప్రాంతం, బీచ్, బోటు పార్కింగ్ తదితర ప్రాంతాలను భక్తులు సులభతరంగా గుర్తించేందుకు పంచాయతీరాజ్ విభాగం వారు సైన్ బోర్డులు, దేవాలయ ప్రాంగణంలో లైట్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. దేవస్థానంలో ప్రధాన కమాండ్ కంట్రోల్ రూమ్, స్నానఘట్టాల వద్ద మినీ కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేసినట్టు తెలిపారు. 21 శాఖల సిబ్బంది 24/7 పనిచేయడం జరుగుతుందని, వివిధ ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుచేసి వాటిని కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేస్తూ మొత్తం వ్యవస్థను పరీక్షించాలన్నారు. 'ఈ సారి సీసీ కెమెరాలను గత సంవత్సరం కంటే ఎక్కువ ఏర్పాటు చేశాం. బస్టాండు తదితర ప్రాంతాల్లో పారిశుధ్యం, లైటింగ్ ఏర్పాట్లు, బీచ్ వద్ద సెక్యూరిటీ తదితర ఏర్పాట్లను అధికారులు సమన్వయంతో చేపట్టి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, ప్రమాదాలకు తావు లేకుండా ఉత్సవాలను విజయవంతం చేయాలి. జిల్లా రవాణాధికారి ఉత్సవాలకు వచ్చే యాత్రికుల వాహనాలు ఓవర్‌లోడ్ లేకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి. ప్రధానంగా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు 20 స్టాల్స్ ఏర్పాటు చేసి తాగునీటిని సమృద్ధిగా అందించడంతో పాటు భక్తుల సౌకర్యార్థం 120 మొబైల్ టాయిలెట్లను ఏర్పాటు చేయాలి. జిల్లా పంచాయతీ అధికారి, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఏపీడీ దేవస్థానం పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య వ్యవస్థను పర్యవేక్షించాలి. 11 పార్కింగ్ ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తూ కంట్రోల్ రూముకు అనుసంధానించాలి. పారిశుధ్య ప్రక్రియను డీఎల్డీవో పర్యవేక్షించాలి. అధికారులు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయడంతో పాటు ప్రత్యామ్నాయంగా జనరేటర్లు ఏర్పాటు చేసుకోవాలి. ఆలయం చుట్టుపక్కల నాలుగైదు కిలోమీటర్ల పరిధిలో వీధిలైట్లు సక్రమంగా పనిచేస్తున్నదీ లేనిదీ పరిశీలించాలి. జిల్లా పౌరసరఫరాలు, తూనికలు, కొలతలు శాఖల అధికారులు సమన్వయంతో ధరల నియంత్రణపై దృష్టి సారించాలి. ఫుడ్ సేఫ్టీ అధికారులు ఉత్సవాల్లో ప్రసాదాలు, ఆహార పదార్థాలను వర్తకులు అమ్మే ఆహార పదార్థాలను పరిశీలించి కల్తీ లేకుండా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. కల్యాణవేదిక వద్ద అమలాపురం ఆర్డీవో కె.మాధవి ఇన్‌చార్జిగా వ్యవహరిస్తారన్నారు. విధులు నిర్వహించే సిబ్బందికి ముందుగానే పాస్‌లు మంజూరు చేస్తారన్నారు. రథోత్సవ ప్రక్రియను డ్వామా పీడీ పర్యవేక్షిస్తూ వేతన కూలీల సమన్వయంతో పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించాలన్నారు. కల్యాణోత్సవం, రథోత్సవంలో ఎటువంటి ప్రమాదాలకు ఆస్కారం లేకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు రథం ఫిజికల్ ఫిట్‌నెస్‌ను ధ్రువీకరించాలన్నారు. చక్రస్నాన ప్రక్రియను రామచంద్రపురం ఆర్డీవో అఖిల పర్యవేక్షిస్తారన్నారు. వైద్యఆరోగ్య శాఖ ఐదు మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేయడంతో పాటు చుట్టుపక్కల ఆసుపత్రులను అత్యవసర సమయంలో వినియోగించే విధంగా మ్యాపింగ్ చేయాలన్నారు. ఆర్టీసీ 105 బస్సు సర్వీసులను ఏర్పాటు చేస్తూ ప్రయాణికుల రాకపోకలు సురక్షితంగా నిర్వహించాలన్నారు. డ్రోన్ చిత్రీకరణను కమాండ్ కంట్రోల్ రూముకు అనుసంధానించాలన్నారు. టోయింగ్ వాహనాలను రెండింటిని ఏర్పాటు చేయాలన్నారు. మెరైన్ పోలీసులు బీచ్ వద్ద పర్యవేక్షించాలన్నారు. ఉత్సవాల్లో మద్యం షాపులను పూర్తిగా మూసివేయించాలని పోలీసులను ఆదేశించారు. ప్రధాన కంట్రోల్ రూము నుంచి ప్రతీ గంటకు జిల్లా కలెక్టర్ ఫోన్‌కు ఉత్సవాల నిర్వహణ తీరు పట్ల సందేశాన్ని పంపించాలన్నారు. ప్రధాన కమాండ్ కంట్రోల్ రూము స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కేఆర్సీ ఇన్‌చార్జిగాను, మినీ కమాండ్ కంట్రోల్ రూముకు డీఆర్డీఏ పీడీ ఇన్‌చార్జిగా వ్యవహరించాలన్నారు. అగ్నిమాపక, విపత్తు స్పందన సంస్థ, అగ్నిమాపక వాహనాలు ఏర్పాటు చేయాల

రాజమహేంద్రవరం
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి
ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

హెల్మెట్ ధరించడం భారం కాదు.. బాధ్యత

రహదారి భద్రత మాసోత్సవ ర్యాలీలో అడిషనల్ ఎస్పీ మురళీకృష్ణ



హెల్మెట్ ధారణపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): హెల్మెట్ ధరించడం భారంగా కాకుండా బాధ్యతగా భావించాలని జిల్లా అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) ఎన్‌బీఎం.మురళీకృష్ణ అన్నారు. జిల్లా పోలీస్, జిల్లా రవాణాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఎస్పీ నరసింహకిశోర్ ఆదేశాల మేరకు మహిళా పోలీసులు, సిబ్బంది కలిపి గురువారం హెల్మెట్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు.ఈ ర్యాలీకి జిల్లా ఎస్పీ కార్యాలయం వద్ద అడిషనల్ ఎస్పీ మురళీకృష్ణ, జిల్లా ట్రాన్స్‌పోర్టు ఆఫీసర్ సురేష్ బాబు జెండా ఊపి ప్రారంభించారు.ర్యాలీ నగరంలో జెఎన్ రోడ్డు, రామాలయం సెంటర్, ముగ్గుపేట సెంటర్, అజాద్ చౌక్, దేవిచౌక్ సెంటర్, కంబాలచెరువు మీదుగా చిరంజీవి బస్టాండ్ వరకు సాగింది. అనంతరం మానవహారం నిర్వహించారు. బైక్‌లు, స్కూటీలపై హెల్మెట్ లేకుండా వెళ్లేవారిని ఆపి వారికి మరాద్యగా గులాబి ఇచ్చి హెల్మెట్ ఆవశ్యకతను వివరించారు.హెల్మెట్ ధరించి సురక్షిత ప్రయాణం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌బీ డీఎస్పీ బి.రామకృష్ణ, ఎస్‌బీ సీఐ ఏ.శ్రీనివాసరావు, ట్రాఫిక్ సీఐ-1 నబీ, సీఐ-2 సీహెచ్ సూరిబాబు, మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ కె.మంగాదేవి అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

జీటీజీహెచ్‌లో ఓపీ పర్యవేక్షణ కమిటీ నియామకం

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం ప్రభుత్వ సమగ్ర బోధనాసుపత్రి (జీటీజీహెచ్)లో అవుట్ పేషెంట్ (ఓపీ) రోగుల వైద్యసేవలకు సంబంధించి మోనిటరింగ్ కమిటీని నియమించారు. ఆసుపత్రిలోని మొత్తం పది మంది విభాగాధిపతులతో ఈ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ ఆయా విభాగాల వారీగా ఓపీ ఫెర్‌ఫార్మెన్స్‌కు సంబంధించి ప్రతి నెలా రిపోర్టులను అందజేయాల్సి ఉంటుంది. ఈ కమిటీలో ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సౌభాగ్యలక్ష్మి, బోధనాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీ సూర్యప్రభ, జనరల్ మెడిసిన్ హెచ్‌వోడీ డాక్టర్ పీవీవీ సత్యనారాయణ, జనరల్ సర్జరీ హెచ్‌వోడీ డాక్టర్ ఆర్.హేమంతి, ఓబీసీ హెచ్‌వోడీ డాక్టర్ అక్కమాంబ, పీడియాట్రిక్స్ హెచ్‌వోడీ డాక్టర్ సీఎస్ మోహన చంద్ర, న్యూరో సర్జరీ హెచ్‌వోడీ డాక్టర్ జి.రాజశేఖర్‌రెడ్డి, అనస్థీషియా హెచ్‌ఓడీ డాక్టర్ ఎస్.అనిల్‌కుమార్, డెర్మటాలజీ హెచ్‌ఓడీ డాక్టర్ జి.సూర్యనారాయణ, ఆర్థో హెచ్‌ఓడీ డాక్టర్ ఎస్.చంద్రశేఖర్, సైకియాట్రి హెచ్‌ఓడీ డాక్టర్ ఎన్.అన్నపూర్ణ లతో ఈ కమిటీని ఏర్పాటు చేశారు. ఈమేరకు ఆయా విభాగాల హెచ్‌ఓడీలు తమ శాఖలకు చెందిన వైద్యుల ఓపీ పని తీరుకు సంబంధించి ప్రతి నెలా నివేదికలు అందజేయాలని జీటీజీహెచ్ సూపరింటెండెంట్ తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

వైద్య విద్యకు ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు దూరం

సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు



సమావేశంలో మాట్లాడుతున్న మధు

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు వైద్య విద్యకు దూరం కానున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు విమర్శించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ రంగంలో 11మెడికల్ కాలేజీలు నిర్మాణంలో ఉంటే వాటిని తాము పూర్తి చేయలేమంటూ నేషనల్ మెడికల్ కౌన్సిల్‌కు కూటమి ప్రభుత్వం లేఖ రాయడం దారుణమన్నారు. దీనివల్ల 2025 విద్యాసంవత్సరంలో 700ఎంబీబీఎస్ సీట్లు కోల్పోయే ప్రమాదం ఉందని ఆయన పేర్కొన్నారు. మొత్తం 11 మెడికల్ కాలేజీలను ప్రారంభించకపోవడం వల్ల ఏపీలో సుమారు 2,450 మంది విద్యార్థులు సీట్లు కోల్పోతారని, దీంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ కులాలకు చెందిన పేద విద్యార్థులు వైద్య విద్య సీట్లు కోల్పోతారని పేర్కొన్నారు. దీంతో డబ్బున్నవారికి మాత్రమే వైద్య విద్య అందుబాటులోకి వస్తుందని, పేదలకు తీవ్ర నష్టం కలుగుతుందని మధు అన్నారు. మీడియా సమావేశంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కె.రాంబాబు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

గాంధీ బోధనలు అనుసరణీయం

» టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని
» ఘనంగా మహాత్ముడి వర్ధంతి
» నాయకులు, అధికారుల నివాళి



రాజమహేంద్రవరంలో గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న గన్ని కృష్ణ

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 30(ఆంధ్రజ్యోతి): నేటి సమాజానికి మహాత్మగాంధీ బోధనలు అనుసరణీయమని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ అన్నారు. గాంధీజీ వర్ధంతి సందర్భంగా రాజమహేంద్రవరం కంబాలచెరువు సెంటర్‌లో గాంధీ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తంగెళ్ల బాబి, జక్కంపూడి అర్జున్, మళ్ల వెంకట్రాజు, కేవీ శ్రీనివాస్, సింహాద్రి కోటిలింగేశ్వరరావు, వానపల్లి శ్రీనివాసరావు, జి.కొండబాబు, సతీష్ పాల్గొన్నారు.

బిక్కవోలు: బిక్కవోలులో గాంధీ విగ్రహానికి కూటమి నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పల్లి శ్రీనివాసరెడ్డి, పాలచర్ల శివప్రసాద్‌చౌదరి, గొర్రెల త్రిమూర్తులు, గుణ్ణం రమేష్‌చౌదరి, జంపా వెంకటరమణ, పాల్గొన్నారు. బలభద్రపురం పంచాయతీలో సర్పంచ్ బుంగ రామారావు గాంధీ చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ జాన్‌మిల్టన్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ సాయి, కార్యదర్శి కర్రి సంజీవరెడ్డి పాల్గొన్నారు. ఊలపల్లి మెయిన్ పాఠశాలలో ఎంఈవో-2 పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కొవ్వూరి అమ్మిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రాజానగరం: స్థానిక గాంధీ సెంటర్‌లోని ఆయన విగ్రహానికి మండల ఆర్యవైశ్య సంఘం నాయకుల ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. అహింసా మార్గంలో గాంధీజీ చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమని కొనియాడారు. కార్యక్రమంలో సంఘం మండలాధ్యక్షుడు మండవెల్లి వెంకన్నబాబు, గ్రంధి రాజా, సముద్రాల రాంబాబు, దవులూరి శ్రీను, గ్రంధి నానబ్బులు, గ్రంధి సత్తిబాబు, కేఎస్ఎన్ మూర్తి పాల్గొన్నారు.

గోకవరం: స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపం వద్ద గాంధీజీ విగ్రహనికి పలువురు పూలమాలలు వేశారు. ప్రతి ఒక్కరూ గాంధీ అడుగు జాడ ల్లో నడవాలని ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర ఈసీ మెంబరు బత్తుల సత్తిబాబు అన్నారు. కార్యక్రమంలో సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

అనపర్తి: స్థానిక గాంధీ బొమ్మసెంటర్ వద్ద మహాత్ముని వర్ధంతిని నిర్వహించారు. గోదావరి తూర్పు డెల్టా ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ తమలంపూడి సుధాకరరెడ్డి మాట్లాడుతూ గాంధీజీని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, కర్రి శేషారత్నం, ఒంటిమి ప్రకాష్, చింతా ప్రకాశరెడ్డి, కర్రి వెంకటరెడ్డి, ఎస్ఆర్‌కే ప్రసాదరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అనపర్తిలో గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కడియం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని మురమండ విద్యుత్ సబ్‌స్టేషన్ 11 కేవీ పొట్టిలంక ఫీడర్ కొత్త స్తంభాలు వేసే నిమిత్తం శుక్రవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ట్రాన్స్‌కో ఈఈ దాట్ల శ్రీధర్‌వర్మ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. వీరవరంలో బోర్లకు, గృహాలకు, దామిరెడ్డిపల్లిలో బోర్లకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

మార్చిలో ఏఐకేఎంఎస్ 3వ జాతీయ మహాసభలు

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర నాందేడ్‌లో మార్చి 21,22,23, తేదీల్లో జరిగే ఏఐకేఎంఎస్ 3వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జాతీయ అధ్యక్షురాలు పి.టాన్యా ,జాతీయ ప్రధాన కార్యదర్శి అశోక్ ఘాయల్ పిలుపునిచ్చారు. రాజమండ్రి ప్రెస్ క్లబ్‌లో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతాంగ,వ్యవసాయ కూలీల సమస్యలపై ఏఐకేఎంఎస్ రాజీలేని పోరాటాలు సాగిస్తుందన్నారు. ఆపరేషన్ కగార్‌ను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఏఐకేఎంఎస్ జాతీయ నాయకులు బి.భాస్కర్, ఎం. ప్రతాప్‌రెడ్డి, టి.ప్రకాష్ ,యు.గనిరాజు, కె.బాలుదొర, డిపి పోలయ్య తదితరులు పాల్గొన్నారు.

సమరసత సేవా ఫౌండేషన్ సమావేశం

రాజమహేంద్రవరం కల్చరల్,జనవరి 30(ఆంధ్రజ్యోతి): రాయుడుపాక వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో సమరత సేవా ఫౌండేషన్ జిల్లా సమావేశం గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థానం వ్యవస్థాపకులు బుద్దాల వెంకన్నబాబు, బుద్దాల అమ్మిరాజు, జిల్లా ధర్మప్రచారకర్త కుక్రి శ్రీనివాస్, జగన్నాథం, రామ్ శంకర్, నాగమణి, రాంగోపాల్ రెడ్డి తదితరుల పాల్గొన్నారు.

రాజమహేంద్రవరంలో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 30(ఆంధ్ర జ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణలో బాగంగా జిల్లా ఎస్పీ డి.నరసింహకిషోర్ ఆదేశాల మేరకు ట్రాఫిక్ డీఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో నగరంలో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. రాజమహేంద్రవరం ట్రాఫిక్ స్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వాహనదారులను చెక్ చేసి 35 మందిపై కేసులు నమోదు చేశారు.అనంతరం వారిని 3వ ఏజేఎఫ్‌సీ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచారు. న్యాయమూర్తి సి.రమ్య నిందితుల్లో ఒకరికి ఒకరోజు జైలు శిక్ష ,34 మందికి రూ. 10 వేలు చొప్పున జరిమానా విధించారు.

17 మోటారు వెహికల్స్ వేలం

రాజమహేంద్రవరం రూరల్,జనవరి 30(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం రూరల్ మండలం ధవళేశ్వరం పోలీస్ స్టేషన్‌లో 102 కేసుల్లో సీజ్ చేసిన 17 మోటారు వెహికల్స్ వేలం పాట నిర్వహించినట్టు సీఐ గణేష్ తెలిపారు. సౌత్ జోన్ డీఎస్పీ భవ్యకిషోర్ ఆధ్వర్యంలో స్టేషన్ ఆవరణలో ద్విచక్ర వాహనాలకు వేలం నిర్వహించినట్టు తెలిపారు. ఎంవీఐ నిర్ణయించిన ధర రూ.71 వేలకు వేలం పెట్టగా మొత్తం 1,74,758 నగదు ప్రభుత్వ ట్రెజరీ అకౌంట్‌లో జమ చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ హరిబాబు, ఆర్ఐ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని విలువైన భవిష్యత్తును పాడుచేసుకోవద్దని సీఐ గణేష్ సూచించారు. ధవళేశ్వరం శ్రీలక్ష్మిజనార్ధన స్వామి కాలనీలో గురువారం రాత్రి ప్రజలకు అవగాహన కల్పించారు. పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రులు నిఘా పెట్టాలన్నారు. గంజాయి వల్ల యువత భవిష్యత్ పాడైపోతుందన్నారు. కాలనీలో కొన్నిచోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుని అక్కడికి వస్తున్న మందుబాబుల చర్యలను రికార్డు చేసి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో పన్నాల వెంకటలక్ష్మి, నాగేశ్వరరావు, పేరాబత్తుల శ్రీదేవి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వాంబేకాలనీలో సమస్యలు పరిష్కరిస్తా



వాంబేగృహాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 30(ఆంధ్రజ్యోతి): మునిసిపల్ కాలనీ వాంబే గృహాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరం 42వ డివిజన్‌లో గురువారం వాంబే కాలనీలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్నికృష్ణ, నగరపాలక సంస్థ అధికారలుతో కలిసి పర్యటించారు. స్థానిక ప్రజలతో మాట్లాడి వారి సమస్యలు అడిగితెలుసుకున్నారు. వాంబేకాలనీలో తాగు నీటి సమస్యకు పరిష్కారం చూపిస్తామన్నారు. డివిజన్‌లో నిత్యం పారిశుధ్యనిర్వహణ చేపట్టాలని శానిటేషన్ సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్, మజ్జి రాంబాబు, టీడీపీ నాయకులు మళ్ళ వెంకట్రాజు, కేవీ శ్రీనివాస్, ఆడారి లక్ష్మినారాయణ, వానపల్లి శ్రీనివాస్, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

దేవదాయశాఖ భూముల
పీజీఆర్ఎస్ అర్జీలపై విచారణ



వివరాలు తెలుసుకుంటున్న జిల్లా దేవదాయశాఖాధికారి నాగేశ్వరరావు

బిక్కవోలు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): బిక్కవోలు లక్ష్మీనారాయణ దేవస్థానంలో బుధవారం దేవదాయశాఖ భూముల గురించి పీజీఆర్ఎస్‌లో పిటిషన్లపై బుధవారం జిల్లా దేవదాయశాఖాధికారి కే. నాగేశ్వరరావు విచారణ చేపట్టారు. అనపర్తి మండలం మహేంద్రవాడలోని దేవాలయాలకు సంబంధించిన భూములను ఎవరో అమ్మితే కొందరు రైతులు కొనుగోలు చేశారు. అయితే గత ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేసి వీటిని ఆ రైతులకే కట్టబెట్టింది. అయితే కూటమి ప్రభు త్వం వచ్చాక మరలా రెవెన్యూ సదస్సులు నిర్వహించి వాటిని రద్దు చేసింది. అయితే మహేంద్రవాడలోని ఎనిమిది మంది రైతులు ఈ భూములపై పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో జిల్లా దేవదాయశాఖాధికారి వీరి నుంచి వివరాలు తీసుకుని విచారణ జరిపారు. వివరాలను ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఆయన చెప్పారు. తనిఖీలో దేవదాయశాఖ అధికారులతో పాటు అనపర్తి డీటీ తులసి, బిక్కవోలు ఈవో ఆకెళ్ల భాస్కర్, తదితరులు ఉన్నారు.

జడ్పీ హైస్కూల్‌కు మైక్‌సెట్ బహూకరణ



మైక్‌సెట్‌ను బహూకరిస్తున్న సర్పంచ్ సాయిరాం

బిక్కవోలు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మెళ్లూరు జడ్పీ హైస్కూల్‌కు గురువారం ఆ గ్రామ సర్పంచ్ పెద్దిరెడ్డి సత్యసాయిరాం రూ.15 వేలు విలువ చేసే మైక్‌సెట్‌ను బహూకరించారు. హెచ్‌ఎం జీ.లక్ష్మికి అందజేశారు. ఎస్‌ఎంసీ చైర్మన్ గంగుమళ్ల శ్రీనివాస్, ఉపాధ్యాయులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

కోరుకొండ రోడ్లకు మరమ్మతులు : ఎమ్మెల్యే



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే

కోరుకొండ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి):మండలంలోని రోడ్లకు మరమ్మతులు చేపడుతున్నట్టు ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ తెలిపారు. గురువారం ఆయన స్థానిక జనసేన పార్టీ కార్యాలయం వద్ద ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రూ. 40 లక్షలతో రాపాక, నల్లొండ, కోటికేశవరం గ్రామాల్లో తాత్కాలిక మరమ్మతు పనులు చేశామన్నారు. అలాగే రూ. మూడు లక్షలతో చినకొండేపూడిలో చేశామన్నారు. నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేని విధంగా 71 మందికి రూ.1.36 కోట్ల సీఎంఆర్ఎఫ్ చెక్కులను క్లియర్ చేశామన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు అడపా శ్రీనివాసు, అడ్డాల శివ, బదిరెడ్డి దొర, మేడిశెట్టి శివరాం,ముక్కా రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

తీపర్రు లైబ్రేరియన్‌కు సత్కారం

పెరవలి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): తీపర్రు శాఖా గ్రంథాలయం లైబ్రేరియన్ వెంకట జయలక్ష్మిని గ్రామస్థులు ఘనంగా సత్కరించారు. రిపబ్లిక్ డే సందర్భంగా జయలక్ష్మి ఉత్తమ లైబ్రేరియన్‌గా కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ నేపథ్యంలో గ్రామస్థులు గురువారం అభినందించి సన్మానించారు. నిత్యం సమయానికి గ్రంథాలయాన్ని తెరిచి ఉంచి పిల్లలకు పలు రకాలుగా విజ్ఞానదాయక విషయాలు తెలియజేస్తుండడం ద్వారా ఆమె గుర్తింపు పొందారని పలువురు ప్రశంసించారు. గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కంటిపూడి సూర్యనారాయణ, నందమూరి నారాయణరావు, కరుటూరి శ్రీనివాసరావు, బలుసు వెంకటరావు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డికి ఆహ్వానం



శుభలేఖను అందిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి దంపతులు

అనపర్తి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : మాజీ ఎమ్మెల్యే, డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డిని గురువారం ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మహాలక్ష్మి దంపతులు కలిశారు. వచ్చేనెల 8వ తేదీన హైదరాబాద్‌లో జరగనున్న తన కుమారుడు మనోజ్‌రెడ్డి వివాహానికి హాజరుకావాలని ఆహ్వానపత్రిక అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గోకవరం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం గోకవరంలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఆ శాఖ ఏఈ సుబ్రహ్మణ్యం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదన్నారు. 11కేవీ లైన్ మరమ్మతుల కారణంగా నిలిపివేస్తున్నట్టు ఆయన ప్రకటించారు.

నేడు, రేపు రంగంపేటలో..

రంగంపేట: రంగంపేట మండలం 33/11 కేవీ వడిశలేరు విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి సరఫరా అయ్యే 11 కేవీ వడిశలేరు టౌన్ ఫీడర్, 11 కేవీ వడిశలేరు రూరల్ ఫీడర్ ఏడీబీ రోడ్డు విస్తరణ పనుల నిమిత్తం శుక్ర, శనివారాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నట్టు ఏఈ దాట్ల శ్రీధర్‌వర్మ తెలిపారు. వడిశలేరు, ముకుందవరం గ్రామాలకు కరెంట్ ఉండదన్నారు.

కుంభాభిషేక కార్యక్రమాలు ప్రారంభం



వేదమంత్రాలతో జరుపుతున్న సీతారామకల్యాణం

దివాన్‌చెరువు, జనవరి30 (ఆంధ్రజ్యోతి): దివాన్‌చెరువులోని డాక్టర్ రాంబాబు గృహ ఆవరణలో శ్రీహేరంబగణపతి, బాలకుమార స్వామి సహిత విశ్వేశ్వరి అమ్మవారి ఆలయంలో కుంభాభిషేక కార్యక్రమాలు గురువారం ప్రారంభమయ్యాయి. నిర్వాహకులు డాక్టర్ కేవీఆర్ సుబ్రహ్మణ్యం (లక్ష్మీరాంబాబు) ఆధ్వర్యంలో మంగళవాయిద్యాలు, వేదమంత్రాల నడుమ అంకురార్పణ జరిగింది. ఆలయప్రాంగణంలో ఏర్పాటుచేసిన ప్రత్యేక వేదిక సీతారామలక్ష్మణ సమిత ఆంజనేయస్వామి ఉత్సవ విగ్రహాలను ఏర్పాటుచేసి కన్నులపండువగా సీతారామకల్యాణాన్ని వేదపండితులు నిర్వహించారు. సీతారామకల్యాణంపై సాహితీవేత్త టీవీ నారాయణరావు ప్రసంగించారు.

పాలచర్ల పీహెచ్‌సీలో 'స్పర్శ'

దివాన్‌చెరువు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): పాలచర్ల పీహెచ్‌సీ పరిధిలో గురువారం స్పర్శ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు ఆ కేంద్రం వైద్యాధికారి బెనడిక్ట్ తెలిపారు. దీనిలో భాగంగా ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశ కార్యకర్తలు ఇంటింటా తిరిగి శరీరంపై అనుమానిత మచ్చలగల వారిని గుర్తించారు. అనంతరం ఆ వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరిచారు.

సారాతో ఒకరి అరెస్ట్



వ్యక్తిని అరెస్ట్ చేసిన ఎక్సైజ్ పోలీసులు

రంగంపేట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రంగంపేట ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని రంగంపేట మండలం, రంగంపేటలో గురువారం సారా స్థావరాలపై ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఇందులో బత్తిన ధనరాజు అనే వ్యక్తి ఐదు లీటర్ల సారా కలిగి ఉండడంతో అతన్ని అరెస్ట్ చేసినట్టు ఎక్సైజ్ సీఐ సుధ తెలిపారు. ఎస్ఐ దుర్గాప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

జీఎస్ఆర్ ఫిలిమ్స్ రూపొందించిన లోగో ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సుధాకరరెడ్డి, ఎస్ఐ శ్రీను నాయక్

అనపర్తి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): నేటి యువత చెడు వ్యసనాలకు బానిసై జీవితాన్ని నాశనం చేసుకుంటుందని, అలాంటి వారిని చైతన్యవంతుల్ని చేసే విధంగా జీఎస్ ఆర్ ఫిలిమ్స్ సంస్థ రూపొందించిన వీడియో ప్రజల్లోకి వెళ్లాలని గోదావరి తూర్పు డెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ తమలంపూడి సుధాకరరెడ్డి అన్నారు. జీఎస్ఆర్ ఫిలిమ్స్ సంస్థ రూపొందించిన వీడియో సాంగ్ లోగోను గురువారం ఆవిష్కరించారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సుధాకరరెడ్డి, ఎస్ఐ శ్రీను నాయక్, యోగా గురువు వెలగల ఫణికృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో ఫిలిమ్స్ ప్రతినిదులు నిర్మాత గొలుగూరి శ్రీనివాసరెడ్డి, దర్శకుడు వెంకట్ కొమ్మోజు, ఆర్టిస్టులు అఖిల్, ఆదిత్య, సురేంద్ర పాల్గొన్నారు.

గంగాలమ్మవారికి రూ. 1.25 లక్షల విరాళం



ఆర్థిక సహాయం అందజేస్తున్న దృశ్యం

కోరుకొండ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రామసేన విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు, బీజేపీ నేత గురువారం కోరుకొండలోని గంటాలమ్మ వారి ఆలయానికి రూ.1.25 లక్షల విరాళాన్ని అందజేశారు. మార్కెట్ సమీపంలో గల అమ్మ వారి ఆలయం వద్ద నిర్వహించిన అన్నసమారాధన కార్యక్రమానికి కంబాల శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు మామిడి అయ్యప్ప, వినకోటి బాపన్నదొర, వరసాల ప్రసాద్, వల్లూరి జగన్నాధరావు శర్మ, కట్టా కల్యాణ్, బత్తుల నానాజీ, ఉంగరాల ఆదివిష్ణు, మణిరత్నం, పద్మరాజు ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి



వేగేశ్వరపురంలో విద్యార్థులకు అవగాహన కలిగిస్తున్న ఎస్ఐ రామకృష్ణ

తాళ్లపూడి / దేవరపల్లి: జనవరి 30 (ఆంధ్రజ్యోతి): జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు 2025 సందర్భంగా మండలంలోని వేగేశ్వరపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు గురువారం ఎస్ఐ టి.రామకృష్ణ ఆధ్వర్యంలోను, దేవరపల్లిలోని బీహెచ్ఎస్ ఆర్‌వీఎల్ఎం డిగ్రీ కాలేజీలో ఎస్ఐ వి.సుబ్రహ్మణ్యం అవగా హన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని, దిచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు. వాహనాలకు నెంబర్‌ప్లేట్లు లేకుండా డ్రైవింగ్ చేయడం చట్టరీత్యా నేరమని అతివేంగా వాహనాలు నడిపి ప్రమాదాలకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మద్యం తాగి వాహనా లు నడపరాదని, కారు డ్రైవింగ్ చేసేటప్పుడు సీటుబెల్టు పెట్టుకోవాలని సూచిం చారు. ప్రిన్సిపాల్ బీడీఎన్ కుమార్, అధ్యాపకులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

క్యూ కట్టి మరీ రిజిస్ట్రేషన్లు

- రేపట్నుంచి చార్జీలు పెరుగుతుండటమే కారణం

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): భూములు, ఇళ్ళ రిజిస్ట్రేషన్ల ధరలను పెంచి వచ్చేనెల ఒకటో తేదీ నుంచి ప్రభుత్వం అమలు చేస్తున్న నేపథ్యంలో గురువారం జిల్లా వ్యాప్తంగా రిజిస్ట్రేషన్ల కోసం ప్రజలు క్యూ కట్టారు. ఇందులో రాజానగరం, బిక్కవోలు, పిడింగొయ్యి, కడియం, రాజమహేంద్రవరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద కక్షిదారులు పడిగాపులు కాశారు. ఉదయం నుంచి భూములు, ఇళ్లు, పొలాలు రిజిస్ట్రేషన్ చేయించుకునేందు ప్రజలు వచ్చారు. గురు,శుక్రవారాలల్లో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ జరుగుతుంది, ఆయా కార్యాలయాలో సర్వర్లు చాలా ఆలస్యంగా పనిచేయడంతో రిజిస్ట్రేషన్లు మందకొడిగా సాగుతున్నాయి. ఎంత ఆలస్యమైనా రేపటికల్లా పూర్తి చేసుకునేందుకు ఆయా కక్షిదారులు సిద్ధంగా ఉన్నారు.

నేటి నుంచి వెంకన్న కల్యాణోత్సవాలు

దివాన్‌చెరువు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): దివాన్‌చెరువులోని డీబీవీ రాజు సిటీలో కొలువైన శ్రీభూదేవి గోదా ఆండాల్‌సమేత వెంకటేశ్వరస్వామి వారి వార్షిక కల్యాణమహోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభమవుతాయని నిర్వాహకులు తెలిపారు. దీనిలో భాంగా ఫిబ్రవరి నాలుగో తేదీ వరకు ఉదయం, సాయంత్రం వివిధ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో భక్తులు విశేషంగా పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని నిర్వాహకులు కోరారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు ఇవే..

రాజానగరం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): కానవరంలోని 33/11 కేవీ విద్యుత్ ఉప కేంద్రం నుంచి సరఫరా అయ్యే అన్ని 11 కేవీ విద్యుత్ ఫీడర్లకు శుక్రవారం ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ రాజమహేంద్రవరం రూరల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఆపరేషన్) దాట్ల శ్రీధర్‌వర్మ గురువారం తెలిపారు. ముఖ్యంగా కానవరం, చక్రద్వారబంధం, పరిజెల్లిపేట, రాధేయపాలెంతో పాటు రాకీ ఎవెన్యూకు కరెంట్ ఉండదన్నారు. వినియోగదారులు దీన్ని గమనించాలని ఆయన కోరారు.



గులాబీ తీసుకోండి.. హెల్మెట్ పెట్టుకోండి!



ఎన్నో ప్రమాదాలు ప్రాణాలు బలితీసుకుంటు న్నాయి.. ఇటీవల రోడ్డు ప్రమాదాల్లో యువత ఎక్కువగా ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు.. ప్రమాదం జరిగినా ప్రాణాలు పోకుండా కాపాడుకునే వీలుందని చెప్పినా ఎవరూ వినడంలేదు.. బాధ్యతను భారంగా ఫీలవుతున్నారు.. అలా వద్దు.. బాధ్యతగా ఫీలవ్వండి అంటూ రాజమహేంద్రవరంలో మహిళా కానిస్టేబుళ్లు హెల్మెట్లు పెట్టుకుని గురువారం ఊరంతా బైక్ ర్యాలీ చేశారు. జాతీయ రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా హెల్మెట్ ఆవశ్యకతపై అవగాహన కల్పించారు.. ఈ చిత్రంలోనే చూడండి.. గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం హెల్మెట్ లేకుండా బైక్‌లపై ప్రయాణిస్తున్న వారిని ఆపి ఒక గులాబీ ఇచ్చి ఇక హెల్మెట్ వాడండి అంటూ మర్యాదగా చెప్పడం కొసమెరుపు.. - 8లో

బుర్రకథ..ఊపిరిగా!



మిరియాల అప్పారావు.. మొన్నటి వరకూ ఒక బుర్రకథ కళాకారుడు మాత్రమే.. ఆయన కళ కోసం ఎంత పరితపించారనేది సమాజానికి తెలియని వాస్తవం..ఆ వాస్తవంలోకి వెళ్లి చూస్తే ఆకలి.. కష్టాలు.. కన్నీళ్లు.. బాధలు.. బాధ్యతలు.. అయినా ఆయన మాత్రం కళను వదల్లేదు.. చివరి వరకూ కళనే ఊపిరిగా చేసుకుని జీవించారు.. ఎంతో మంది ఆ కళతో ఏం సాధించావన్నా చిరునవ్వే సమాధానం.. బుర్రకథకు ఆదరణ తగ్గినా తుది వరకూ అదే ఊపిరిగా బతికారు.. ఈ నెల 15వ తేదీన కళామతల్లి ఒడిలోనే ఒరిగిపోయారు..ఆయన లేకున్నా.. కష్టం ఎక్కడికి పోతోంది.. అందుకే కేంద్రం అందించే ఎంతో అత్యున్నత పురస్కారం పద్మశ్రీ దశదినకర్మ రోజునే వెతుక్కుంటూ వచ్చింది.. మళ్లీ మిరియాల బుర్రకథకు ఊపిరులూదింది..! - వివరాలు 6లో

చెరువుల్లో 3.23 లక్షల చేప పిల్లల విడుదల

రాజానగరం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో 46 మైనర్ ఇరిగేషన్ చెరువుల్లో మత్స్యశాఖ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి మత్స్యసంపద యోజన (పీఎంఎస్‌వై) పథకం ద్వారా 3 లక్షల 23 వేల 820 చేపపిల్లలను విడుదల చేసినట్టు కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. రాజానగరం మండలం నందరాడలోని అడుసుమిల్లి వెంకయ్య చెరువులో కలెక్టర్ గురువారం చేపపిల్లలు విడుదల చేశారు.రాష్ట్రప్రభుత్వం ఉచితంగా మత్స్యకార సహకార సంఘాలకు చేప పిల్లలను సరఫరా చేసిందన్నారు. దీనివల్ల జిల్లాలోని మైనర్ ఇరిగేషన్ చెరువుల్లో చేపల ఉత్పత్తితో పాటు ఉత్పాదకత పెరుగుతుందని చెప్పారు.ఈ చేప పిల్లల విడుదల వల్ల 36 మత్స్యకారుల సహకార సంఘాల్లోని 5300 కుటుంబాల జీవనోపాధి మెరుగుపడుతుందన్నారు. మూడు, నాలుగు నెలల్లో చేపపిల్లలు పెరిగి పట్టుకోవడానికి అందుబాటులోకి వస్తాయన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలు మేరకు పీఎంఎస్‌వై కింద ఆక్వాజోన్‌లో ఉన్న చేపల చెరువులకు సబ్సిడీ అందించడం జరుగుతుందని చెప్పారు. ఇప్పటికే చెరువులు తవ్వినాన్‌ఆక్వాజోన్లో ఉన్నవారికి కుడా ప్రభుత్వ మార్గదర్శకాలు మేరకు అనుమతులకు ప్రభుత్వం ఆమోదించిందని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారి వి.కృష్ణారావు, జిల్లా మత్స్యసహకార సంఘం అధ్యక్షుడు బలసాడి రంగారావు, రాజానగరం తహశీల్దార్ జీఎఎల్ఎస్.దేవి, ఎంపీడీవో జెఎ.ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.



చేప పిల్లలు విడుదల చేస్తున్న కలెక్టర్

60 వేల హెక్టార్లలో ఎలుకల నిర్మూలన

జేడీఏ మాధవరావు

రాజమహేంద్రవరం రూరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా 60 వేల హెక్టార్లలో సామూహిక ఎలుకల నిర్మూలన చేపట్టాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు తెలిపారు. రూరల్ మండలం తొర్రేడులో సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించి మాట్లాడారు.జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో ఎలుకల మందు ఉచితంగా పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు.ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త సీహెచ్‌వీ.నరసింహరావు మాట్లాడుతూ ఎలుకల్లో వివిధ రకాలు ఉన్నా యని చిన్న తోక ఎలుక వరి పంటను ఎక్కువ నాశనం చేస్తుందన్నారు.విషపు ఎరలను సాయంత్రం అమర్చాలని తెలిపారు.అనంతరం తొర్రేడు సొసైటీ ఎరువుల గొడౌన్ మాధవరావు తనిఖీ చేసారు.ఈ కార్యక్రమంలో డీఆర్‌సీ ఏడీఏ జయ రామ లక్ష్మి, ఏడీఏ శ్రీనివాసరెడ్డి, వ్యవసాయాధికారి భీమరాజు, విస్తరణాధికారులు వేణు మాధవరావు పాల్గొన్నారు.

'పన్ను' లోటు!



- ఉమ్మడి తూ.గో. జిల్లాలో పేరుకుపోయిన ఆస్తిపన్ను బకాయిలు
- కార్పొరేషన్లు, మున్సిపాల్టీలు, నగర పంచాయతీల్లో రూ.173 కోట్ల పెండింగ్
- రూ.80 కోట్ల వరకు వసూలు అసాధ్యమన్న అధికారులు
- ఏళ్ల తరబడి వసూళ్లకు నానా తిప్పలు పడుతున్న అధికారులు.. టార్గెట్లతో కుస్తీ
- అత్యధిక బకాయిలు ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేటు దుకాణాలు, ఖాళీస్థలాలవే
- అత్యధికంగా కాకినాడ, రాజమహేంద్రి కార్పొరేషన్లలో సగానికిపైనే బకాయిలు
- అమలాపురం మున్సిపాల్టీలో రూ.14.65కోట్లకుగాను రూ.8.95 కోట్ల బాకీలు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఆస్తి పన్ను బకాయిలు కొండలా పేరుకుపోయాయి. ఏళ్లకు ఏళ్లు వసూలవక చుక్కలు చూపిస్తున్నాయి. కార్పొరేషన్లు, మున్సిపాల్టీలు ఎన్ని ప్రత్యేక డ్రైవ్‌లు చేపడుతున్నా మొండిబాకీలు కదలనంటున్నాయి. ఒకపక్క ఇంటి పన్నులు ఎంతో కొంత వసూలవుతున్నా ప్రైవేటు కంపెనీలు, పరిశ్రమలు, వాణిజ్య దుకాణాలు, ఖాళీ స్థలాల పన్నులు మాత్రం ఎక్కడివక్కడే అన్నట్టు కదలడం లేదు. దీంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా ఆస్తి పన్ను బకాయిలు రూ.173కోట్ల వరకు పేరుకుపోయాయి. ఇందులో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంతోపాటు గత కొన్నేళ్ల బకాయిలు సైతం కలిపి ఈ స్థాయిలో పేరుకుపోయాయి. అత్యధికంగా కాకినాడ జిల్లాలో రూ.80.17 కోట్లు, తూ.గో.లో రూ.74.80కోట్లు, అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో రూ.18.76 కోట్లు బాకీలు ఉన్నాయి. ఈ మొత్తం బాకీల్లో అత్యధికంగా ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేటు కంపెనీలు, ఖాళీ స్థలాలే ఉన్నాయి. ఎంత ప్రయత్నిస్తున్నా మొండిబాకీలు కదలడం లేదు. ఇందులో కొన్ని సంస్థలు, కంపెనీలవైతే ఏకంగా పదేళ్లకుమించే బాకీలున్నాయి. దీంతో ఈ బకాయిలను ఏంచేయాలో తెలియక అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

కదలితేగా..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా ఏటా ప్రతి ఇంటి యజమాని నుంచి ప్రైవేటు వాణిజ్య దుకాణాలు, పరిశ్రమలు, కంపెనీలు, ప్రభుత్వ కార్యాలయాలు, ఖాళీస్థలం యజమానులు ఆయా మున్సిపాల్టీలు, కార్పొరేషన్లకు ఆస్తిపన్ను చెల్లించాలి. లేదంటే మున్సిపల్ పరిపాలనశాఖ అపరాధ రుసుం సైతం వసూలు చేస్తుంది. మరోపక్క పన్ను వసూళ్లకు ఆయా మున్సిపాల్టీలు, కార్పొరేషన్లు ప్రత్యేక రెవెన్యూ విభాగం ద్వారా ఇంటింటికి, దుకాణాల వద్దకు వెళ్లి పన్నులు వసూలు చేస్తాయి. అటు ఆన్‌లైన్‌లోను చెల్లింపులు జరపొచ్చు. కానీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మాత్రం ఆస్తి పన్నుల వసూలు పెద్దగా జరగడం లేదు. ప్రతి ఏటా బాకీలు భారీగా పెరిగిపోతున్నాయి. మున్సిపల్ అధికారులు ప్రత్యేక డ్రైవ్‌లు చేపట్టి పన్నుల వసూళ్లు చేస్తున్నా కేవలం గృహ సంబంధిత పన్నులే ఎక్కువగా వసూలవుతున్నాయి. ప్రైవేటు సంస్థలు, కంపెనీలు, పరిశ్రమల నుంచి అసలు బాకీలు కదలడం లేదు. అటు ఖాళీ స్థలాల యజమానులు సైతం బకాయిలు చెల్లించడం లేదు. ఇక ప్రభుత్వ కార్యాలయాలైతే బడ్జెట్ లేక ఏళ్ల తరబడి పన్నులు కట్టడం లేదు. దీంతో ఇవన్నీ కలిపి కోట్లలో పేరుకుపోతున్నాయి. వీటిని ఎలా వసూలు చేయాలో తెలియక మున్సిపల్ అధికారులు తలపట్టుకుంటున్నారు. ప్రధానంగా కాకినాడ జిల్లాలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంతోపాటు పాత బకాయిలు కలిపి ఆస్తి పన్నుల బకాయిలు రూ.132.18కోట్లు వసూలు కావలసి ఉండగా, ఇంతవరకు రూ.52.01కోట్లు వసూలైంది. ఇంకా రూ.80.17కోట్లు రావలసి ఉంది. ఇందులో కాకినాడ కార్పొరేషన్‌కు పాత,కొత్త బకాయిలు కలిపి రూ.100.08 కోట్లు రావలసి ఉండగా, ఇంతవరకు రూ.37.30కోట్లే వసూలైంది. ఇంకా రూ.62.78 కోట్లుపైగా బకాయిలు వసూలు కావలసి ఉంది. అయితే ప్రభుత్వ కార్యాలయాలు, కొన్ని కోర్టు వివాదాల కారణంగా రూ.100 కోట్లలో రూ.20 కోట్ల వరకు పన్నులు వసూలయ్యే అవకాశం లేదని కమిషనర్ భావన వివరించారు. మిగిలిన రూ.80 కోట్లలో రూ.50 కోట్ల వరకు వసూలైందని తెలిపారు. ప్రధానంగా ఖాళీ స్థలాల పన్ను రూ.28కోట్ల వరకు రావలసి ఉందన్నారు. కానీ బాకీలపరంగా కాకుండా ఈ ఆర్థిక సంవత్సరం పన్ను వసూళ్లలో కార్పొరేషన్ రాష్ట్రంలో రెండో స్థానంలో ఉందన్నారు. మరోపక్క తుని మున్సిపాల్టీలో రూ.6.23 కోట్లకుగాను ఇంతవరకు రూ.3.81కోట్లు, పెద్దాపురం రూ.6.05 కోట్లకు రూ.3.22కోట్లు, సామర్లకోట రూ.7.33 కోట్లకు రూ.2.75కోట్లు, పిఠాపురం రూ.8.68 కోట్లకు రూ.2.67కోట్లు, ఏలేశ్వరం నగర పంచాయతీలో రూ.2.35 కోట్లకు రూ.96 లక్షలు, గొల్లప్రోలు రూ.1.47 కోట్లకు రూ.90 లక్షలే వసూలైంది.

తూర్పుగోదావరిలో..

రాజమహేంద్రవరం కార్పొరేషన్‌కు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంతోపాటు పాత బకాయిలు కలిపి రూ.119.46 కోట్ల ఆస్తిపన్ను వసూలవ్వాల్సి ఉంది. కానీ ఇందులో రూ.50.04 కోట్లే వసూలైంది. ఇంకా రూ.69.42 కోట్లు వసూలవ్వాల్సి ఉంది. అయితే ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేటు కంపెనీలు, పరిశ్రమలు, ప్రభుత్వ, ప్రైవేటు స్థలాల నుంచి మాత్రం ఆస్తిపన్నులు వసూలవడం లేదు. అధికారులు ఎన్ని నోటీసులు ఇస్తున్నా వీటి నుంచి స్పందన లేదు. అయితే ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ ఖాళీ స్థలాల నుంచి పన్నులు, కొన్ని న్యాయస్థానం వివాదాలతో కలిపి రూ.23 కోట్ల వరకు పన్నులు వచ్చే అవకాశం లేదని అంచనా వేస్తున్నారు. అటు నిడదవోలు మున్సిపాల్టీలో రూ.7.29 కోట్లకుగాను రూ.3.11 కోట్లే ఆస్తిపన్ను వసూలైంది. కొవ్వూరులో రూ. 3.86 కోట్లకు రూ.2.66కోట్లే వసూలైంది. వెరసి తూర్పుగోదావరి జిల్లాలో రూ.130.61కోట్ల మొత్తం ఆస్తిపన్ను బకాయిలకు ఇప్పటివరకు రూ. 55.81 కోట్లే వసూలైంది. ఇంకా రూ.74.80 కోట్లు వసూలు కావలసి ఉంది. అయితే ఇందులో సగం వరకు వసూలయ్యే అవకాశం తక్కువని అధికారులు ఓ అంచనాకు వచ్చారు.

కోనసీమలో ఇలా..

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ప్రధానంగా అమలాపురం మున్సి పాల్టీలో రూ.14.65 కోట్లకుగాను ఇంత వరకు రూ.5.70 కోట్లే వసూలైంది. మండ పేటలో రూ.7.75 కోట్లకు రూ.4.44 కోట్లు, రామచంద్రపురం రూ. 9.47 కోట్లకు రూ.3.52కోట్లు, ముమ్మిడివరం రూ.1.57 కోట్లకు రూ.కోటి వసూలైంది.ఈ జిల్లాలో మొత్తం రూ. 33.42 కోట్ల పన్నుల వసూలుకుగాను రూ.14.66 కోట్లే జమైంది. ఇంకా రూ.18.76 కోట్ల వరకు రావలసి ఉంది. అయితే మొండి బకాయిలు రూ.9 కోట్ల వరకు ఉన్నాయని ఇవి వచ్చే అవకాశం లేదని అధికారులు చెబుతున్నారు. ఒక రకంగా చెప్పాలంటే ఉమ్మడి జిల్లాలో ఆస్తిపన్నులకు సంబంధించి ఏటా ప్రతి ఆర్థిక సంవత్సరంలో కార్పొరేషన్లు, మున్సిపాల్టీలు టార్గెట్ల నేపథ్యంలో చాలా వరకు నివాస గృహాల నుంచే అధికారులు ముక్కుపిండి పన్నులు వసూలు చేస్తున్నారు. ప్రైవేటు కంపెనీలు, సంస్థలు, దుకాణాలు, ఖాళీ స్థలాల నుంచి మాత్రం రాబట్టడంలో విఫలమవుతున్నారు.





అక్షర..కదలిక

9వ డివిజన్‌లో శరవేగంగా పనులు

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : అక్షరం కదిలించింది..అందరినీ మేల్కొలిపింది.. సమస్యలపై సమర శంఖం పూరించింది.. పరిష్కారం దిశగా అడుగులు వేస్తోంది.. నాలుగు రోజుల కిందటి వరకూ ఆ కాలనీలో ఏ రోడ్డు చూసినా అధ్వానమే.. మరి నేడు ప్రతి రోజూ పారి శుధ్య చర్యలు చేపడుతున్నారు.. క్లీన్ అండ్ గ్రీన్‌గా తీర్చి దిద్దుతున్నారు. రాజమహేంద్రవరం 9వ డివిజన్ వెంకటేశ్వనగర్‌లో మంగళవారం ఏబీఎన్- ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో అక్షరం అండగా.. సమస్యల పరిష్కారమే అజెండాగా నినాదంతో నిర్వహించిన సభలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా ప్రజాప్రతినిధి, అధికారుల దృష్టికి తీసుకెళ్లిన సంగతి విదితమే. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే ఆది రెడ్డి శ్రీనివాస్ హామీ ఇచ్చినట్టుగానే ఆ ప్రాంతంలో అధికారుల చర్యలు వేగంగా సాగుతున్నాయి. గురువారం కూడా నగరపాలక సంస్థ ఎస్ఈ ఐ.పాండురంగారావు,ఈఈ రీటా, ఇంజనీరింగ్ అధికారుల బృందం,మాజీ కార్పొరేటర్ కోసూరి చండీప్రియ, పార్కు కమిటీ, స్థానిక పెద్దలు కలిపి వెంకటేశ్వనగర్‌లో పర్యటించారు. టీ షేప్ రహదారిని పరిశీలించారు.ఈ రోడ్డులో సగానికి గతంలో ప్రతిపాదన ఉంది మిగిలిన సగానికి కూడా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్టు ఎస్ఈ చెప్పారు.అదే రోడ్డులో డ్రైనేజీ సమస్యలపై పరిశీలన చేశారు. వెంకటేశ్వనగర్, విద్యుత్ కాలనీ, బర్మా కాలనీ ప్రాంతాల్లో డ్రైనేజీలను పారిశుధ్య కార్మికులు శుభ్రం చేశారు. రహదారుల పక్కల చెత్త కుప్పలను తొలగించారు. అధికారులు డివిజన్‌లో సమస్యలపై దృష్టి కేంద్రీకరించి పరిష్కారం దిశగా అడుగులు వేస్తున్నారు.









ఎస్‌బీఐ కాలనీ వాకర్స్ రోడ్డు 4వ వీధిలో గత ప్రభుత్వంలో నిర్మించిన డ్రైనేజీ అసంపూర్తిగా ఉంది.దీంతో అపార్టుమెంట్ వాసులు ఇబ్బందులు పడుతున్నారు.ఈ విషయాన్ని సమావేశంలో చెప్పడంతో ఎస్ఈ పరిశీలించారు.కల్వర్టు రహదారి కంటేఎత్తుగా ఉండి ప్రమాదాలు జరుగుతున్నాయి.

ఈ చిత్రంలోనే చూశారా డ్రెయినేజీ ఎంత శుభ్రంగా తయారైందో.. మరో డ్రెయినేజీ కూడా సిల్ట్‌తో నిండిపోవడంతో పారిశుధ్య కార్మికుడితో గురువారం శుభ్రం చేయించారు.

కొవ్వూరు

• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

హెల్మెట్ ధరించడం భారం కాదు బాధ్యత

రహదారి భద్రత మాసోత్సవ ర్యాలీలో అడిషనల్ ఎస్పీ మురళీకృష్ణ



హెల్మెట్ ధారణపై అవగాహన కలిగిస్తున్న పోలీసులు

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): హెల్మెట్ ధరించడం భారంగా కాకుండా బాధ్యతగా భావించాలని జిల్లా అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) ఎన్‌బీఎం.మురళీకృష్ణ అన్నారు. జిల్లా పోలీస్, జిల్లా రవాణాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఎస్పీ నరసింహకిశోర్ ఆదేశాల మేరకు మహిళా పోలీసులు, సిబ్బంది కలిపి గురువారం హెల్మెట్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు.ఈ ర్యాలీకి జిల్లా ఎస్పీ కార్యాలయం వద్ద అడిషనల్ ఎస్పీ మురళీకృష్ణ, జిల్లా ట్రాన్స్‌పోర్టు ఆఫీసర్ సురేష్ బాబు జెండా ఊపి ప్రారంభించారు.ర్యాలీ నగరంలో జెఎన్ రోడ్డు, రామాలయం సెంటర్, ముగ్గుపేట సెంటర్, అజాద్ చౌక్, దేవిచౌక్ సెంటర్, కంబాలచెరువు మీదుగా చిరంజీవి బస్టాండ్ వరకు సాగింది. అనంతరం మానవహారం నిర్వహించారు. బైక్‌లు, స్కూటీలపై హెల్మెట్ లేకుండా వెళ్లేవారిని ఆపి వారికి మర్యాదగా గులాబి ఇచ్చి హెల్మెట్ ఆవశ్యకతను వివరించారు.హెల్మెట్ ధరించి సురక్షిత ప్రయాణం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌బీ డీఎస్పీ బి.రామకృష్ణ, ఎస్‌బీ సీఐ ఏ.శ్రీనివాసరావు, ట్రాఫిక్ సీఐ-1 నబీ, సీఐ-2 సీహెచ్ సూరిబాబు, మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ కె.మంగాదేవి అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి



వేగేశ్వరపురంలో విద్యార్థులకు అవగాహన కలిగిస్తున్న ఎస్ఐ రామకృష్ణ

తాళ్లపూడి/దేవరపల్లి: జనవరి 30 (ఆంధ్రజ్యోతి): జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు 2025 సందర్భంగా మండలంలోని వేగేశ్వరపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు గురువారం ఎస్ఐ టి.రామకృష్ణ ఆధ్వర్యంలోను, దేవరపల్లిలోని బీహెచ్ఎస్ఆర్ వీఎల్ఎం డిగ్రీ కాలేజీలో ఎస్ఐ వి.సుబ్రహ్మణ్యం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు. వాహనాలకు నెంబర్‌ప్లేట్లు లేకుండా డ్రైవింగ్ చేయడం చట్టరీత్యా నేరమని అతివేగంగా వాహనాలు నడిపి ప్రమాదాలకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడపరాదని, కారు డ్రైవింగ్ చేసేటప్పుడు సీటుబెల్టు పెట్టుకోవాలని సూచించారు. కార్యక్రమాల్లో ప్రిన్సిపాల్ బీడీఎన్ కుమార్, అధ్యాపకులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



దేవరపల్లిలో విద్యార్థులకు అవగాహన కలిగిస్తున్న ఎస్ఐ సుబ్రహ్మణ్యం

ప్రజల్లో చైతన్యం కల్పించడానికి సివిల్ రైట్స్ డే



కార్యక్రమంలో మాట్లాడుతున్న తహశీల్దార్ ప్రసాద్

ఉండ్రాజవరం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): సామాజికంగా వెనుకబడిన ప్రజల్లో చైతన్యం కలిగించడానికి సివిల్ రైట్స్ డే నిర్వహిస్తున్నట్టు తహశీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్ చెప్పారు. గురువారం చివటం గ్రామంలో స్థానిక దళితవాడలో నిర్వహించిన సివిల్ రైట్స్ డే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.సమాజంలో సామాజికంగా వెనుకబడిన వర్గాల్లో చైతన్యం కల్పించడానికి ప్రభుత్వం ఇటువంటి కార్యక్రమాలు చేపట్టిందని, కుల, వర్ణ వివక్షత లేకుండా చర్యలు తీసుకుంటున్నట్టు పేర్కొన్నారు. సమాజంలో ఎవరినైనా చులకనగా చూసినా, వివక్షకు గురిచేసినా చట్టపరంగా చర్యలు తీసుకుంటారని తహశీల్దార్ చెప్పారు. కార్యక్రమంలో డీటీ హరిప్రసాద్, వీఆర్వో సోమిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి జీవీ సత్యనారాయణ, స్థానికులు పాల్గొన్నారు.

బిరియానీ దుకాణాల్లో అధికారుల తనిఖీలు



గోపాలపురంలో గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్న అధికారులు

రెండు గ్యాస్ సిలిండర్ల స్వాధీనం

గోపాలపురం,జనవరి 30(ఆంధ్రజ్యోతి) పౌర సరఫరాల శాఖ నిబంధనలు ఉల్లంఘించి టీ, టిఫిన్, బిర్యాని సెంటర్లలో గృహ వినియోగానికి ఉపయోగించే గ్యాస్ సిలిండర్లను ఉప యోగిస్తే చర్యలు తప్పవని సివిల్‌సప్లై డిప్యూటీ తహశీల్దార్ దివాకర్ అన్నారు. గోపాలపురంలో బిర్యాని దుకాణాలను సివిల్ సప్లై అధికారుల బృందం గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సానియా గుంటూరు కచ్ బిర్యాని సెంటర్‌లో వంటకాలకు వినియోగిస్తున్న రెండు గ్యాస్‌సిలిండర్లను స్వాధీనం చేసు కున్నారు. నిర్వాహకులపై కేసు నమోదు చేసి జిల్లా జాయింట్ కలెక్టర్‌కు నివేదిస్తామన్నారు. కార్యక్రమంలో ఉండ్రాజవరం, పెరవలి డీటీ ఎస్ఎస్.సుధీర్‌రెడ్డి, దేవరపల్లి, నల్లజర్ల డీటీ సత్యనారాయణ, నిడదవోలు డీటీ ఎం.అనీల్ పాల్గొన్నారు.

సత్యవాడలో రైల్వే భూముల సర్వే



రైల్వే భూములను సర్వే చేస్తున్న అధికారులు

ఉండ్రాజవరం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సత్యవాడ గ్రామంలో రీసర్వే ప్రాజెక్టు కార్యక్రమంలో భాగంగా గురువారం ప్రభుత్వ భూములను సర్వే చేశారు. అలాగే రైల్వే భూములను కూడా సర్వే రోవర్ సహాయంతో హద్దులను కొలిచారు. కార్యక్రమంలో రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజనీర్ సీహెచ్ గురుకృష్ణ, రీసర్వే డీటీ ఎం.హరిప్రసాద్, వీఆర్వో లక్ష్మీనర్సమ్మ, సర్వేయర్లు పాల్గొన్నారు.

తీపర్రు లైబ్రేరియన్‌కు సత్కారం



జయలక్ష్మిని సత్కరిస్తున్న గ్రామ ప్రముఖులు

పెరవలి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): తీపర్రు శాఖా గ్రంథాలయం లైబ్రేరియన్ వెంకట జయలక్ష్మిని గ్రామస్థులు ఘనంగా సత్కరించారు. రిపబ్లిక్ డే సందర్భంగా జయలక్ష్మి ఉత్తమ లైబ్రేరియన్‌గా కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ నేపథ్యంలో గ్రామస్థులు గురువారం అభినందించి సన్మానించారు. నిత్యం సమయానికి గ్రంథాలయాన్ని తెరచి ఉంచి పిల్లలకు పలు రకాలుగా విజ్ఞానదాయక విషయాలు తెలియజేస్తుండడం ద్వారా ఆమె గుర్తింపు పొందారని పలువురు ప్రశంసించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కంటిపూడి సూర్యనారాయణ, నందమూరి నారాయణరావు, కరుటూరి శ్రీనివాసరావు, బలుసు వెంకటరావు పాల్గొన్నారు.

మార్చిలో ఏఐకేఎంఎస్ 3వ జాతీయ మహాసభలు

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర నాందేడ్‌లో మార్చి 21,22, 23, తేదీల్లో జరిగే ఏఐకేఎంఎస్ 3వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జాతీయ అధ్యక్షురాలు పి.టాన్యా, ప్రధాన కార్యదర్శి అశోక్ ఘాయల్ పిలుపునిచ్చారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు.రైతాంగ,వ్యవసాయ కూలీల సమస్యలపై ఏఐకేఎంఎస్ పోరాటాలు సాగిస్తోందన్నారు. ఆపరేషన్ కగార్‌ను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏఐకేఎంఎస్ నాయకులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 30(ఆంధ్ర జ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా నగరంలో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు.రాజమహేంద్రవరంలో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వాహనదారులను చెక్ చేసి 35మందిపై కేసులు నమోదు చేశారు.వారిని కోర్టులో హాజరుపరచ గా ఒకరికి ఒక రోజు జైలుశిక్ష, 34 మందికి ఒక్కొక్కరికీ రూ.10 వేలు చొప్పున జరిమానా విధించారు.

మహనీయుడు గాంధీ

- ఘనంగా జాతిపిత వర్ధంతి
- నాయకులు, అధికారుల నివాళి
- మల్లవరంలో గాంధేయం పుస్తకం ఆవిష్కరణ, కవితా గోష్టి
- గాంధేయ కవిత రచయితలకు సత్కారం



కొవ్వూరులో గాంధీజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి



దేవరపల్లిలో గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



నిడదవోలులో..



పెరవలి: అజ్జరంలో..

కొవ్వూరు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): కొవ్వూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గురువారం జాతిపిత మహాత్మగాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు గాంధీజీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, మద్దిపట్ల శివరామకృష్ణ, సూరపనేని చిన్ని, సుంకర సత్తిబాబు, గంగుమళ్ళ స్వామి, మద్దిపట్ల సురేష్ పాల్గొన్నారు. కొవ్వూరు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మట్టే ప్రసాద్ ఆధ్వర్యంలో స్థానిక మెయిన్‌రోడ్‌లోని గాంధీజీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కొల్లేపర శ్రీనివాస్, మద్దుల సత్యనారాయణ, మన్యం గుప్తా, తుమ్మలపల్లి రమేష్, వంకాయల శివరామకృష్ణ పాల్గొన్నారు.

నల్లజర్ల: సత్యం, అహింస అనే ఆయుధాలతో భారతదేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చిన ఘనత గాంధీజీకే దక్కుతుందని ఏపీ సర్వోదయ మండల్ జిల్లా అధ్యక్షులు పి.వీరబాబు, జిల్లా రిప్రజెంటేటివ్ కొక్కెరిపాటి పున్నయ్య అన్నారు. నల్లజర్లలోని జాషువా కాలనీలో గాంధీ విగ్రహానికి పూలమాల లతో నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు, వృద్ధులకు అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో కార్యదర్శి ఎ.రవితేజ, వేమగిరి నిర్మలకలపాల శేషు, గంధం విజయ్ జాకబ్ పాల్గొన్నారు. స్థానిక జడ్పీ హైస్కూల్లో జరిగిన కార్యక్రమంలో వాసవీ క్లబ్ ప్రెసిడెంట్ బోడ వెంకటేశ్వరరావు, సమయమంతుల నాగేంద్రస్వామి, నున్న కనకదుర్గ, గుళ్ళపూడి వెంకటరత్నం, ఎన్ఎస్ఎస్ శ్రీనివాస్ పాల్గొన్నారు. అనంతపల్లిలో జరిగిన కార్యక్రమంలో వంకాయల వరకుమార్, చిక్కాల నాగేశ్వరావు, కాజు భద్రయ్య పాల్గొన్నారు. చోడవరంలో జరిగిన కార్యక్రమంలో దొడ్డిగర్ల గంగాధరరావు పంచాయతీ పారిశుధ్య కార్మికులకు కాళ్లు కడిగి వస్త్రాలు దానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పెండ్యాల చందు, ఉండవల్లి గోపి, మద్దిపాటి సుబ్బారావు, అల్లాడి రామకృష్ణ, ఉప్పు నరేష్ పాల్గొన్నారు.

తాళ్లపూడి: స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం వద్ద ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు యండపల్లి శేఖర్, గౌరవ చైర్మన్ సింహాద్రి జనార్ధనరావు, ఉప సర్పంచ్ అప్పన జగదీష్ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి పూల మాలలతో నివాళులర్పించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ అహింస, శాంతి అనే ఆయుధాలతో ఏమైనా సాధించవచ్చని నిరూపించిన మహానుభావుడు గాంధీజీ అని అన్నారు. కార్యక్రమంలో గోకవరపు మాణిక్యం, కంకిపాటి వినయ్, చిరవూరి పోసి, సొలస రూపేంద్ర పాల్గొన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఏఎస్‌వో జోడాల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి నివాళులర్పించారు. ప్రతి పౌరుడూ శాంతియుతంగా జీవించాలని అహింసా మార్గంలో నడవాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ రామకృష్ణ, వీఆర్వో ప్రకాష్, తీలావతి, విజయ, ఇబ్రహీం పాల్గొన్నారు. రాగోలపల్లి ప్రాథమిక పాఠశాలలో గాంధీ వర్ధంతిని అమర వీరుల దినోత్సవంగా నిర్వహించినట్టు ప్రధానోపాధ్యాయుడు దున్నా దుర్గారావు తెలిపారు. ఈ సందర్భంగా గాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు.

చాగల్లు: మండలంలోని మల్లవరం ఆనంద నికేతన్ గాంధీ ఆశ్రమంలో జరిగిన కార్యక్రమంలో మహాత్ముడి విగ్రహానికి సర్వోదయ మండలి సభ్యులు, గాంధేయ వాదులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సర్వమత ప్రార్థనలు నిర్వహించారు. మల్లవరం గాంధీ ఆశ్రమంలో మ్యూజియం ఏర్పాటు చేసి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని తీర్మానించారు. గాంధేయం పుస్తకాన్ని ఆవిష్కరించి కవిత గోష్టి నిర్వహించారు. గాంధేయ కవిత రచయితలను సన్మానించారు. ఏపీ స్మారక నిధి సభ్యులు, సర్వోదయ మండలి సభ్యులు, ఇందుకూరి ప్రసాదరాజు, స్థానిక పెద్దలు లకంసాని సూర్యప్రకాశరావు, కరుటూరి జగన్, ఆశ్రమ అభివృద్ధి కమిటీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిడదవోలు: నిడదవోలులోని గాంధీ బొమ్మ సెంటరులో మహాత్మ గాంధీ విగ్రహానికి వాసవీ క్లబ్ ప్రతినిధులు నివాళులర్పించారు. గాంధీజీ భారత స్వాతంత్ర్య పోరాటంలో కీలక భూమిక పోషించారని, నేటి యువత ఆయనను ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

దేవరపల్లి: స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపం వద్ద జాతిపిత మహాత్మగాంధీ విగ్రహానికి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొత్తగుండి బాబూరావు, యువజన సంఘం అధ్యక్షుడు సుధాపల్లి వెంకట్రామారావు, వాసవి జాగృతి ఇంటర్నేషనల్ గవర్నర్ శ్రీకాకుళపు కాళీకృష్ణ పూలమాలలతో నివాళులర్పించారు. గాంధీజీ అహింసా సిద్ధాంతాన్ని ఆయన చేసిన సేవలను, ఆశయాలను ప్రతీ పౌరుడు గుర్తుంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు సుతాపల్లి వెంకట్రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: మండలంలోని పలు గ్రామాల్లో గాంధీ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటాలకు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పెరవలి: మండలంలోని అజ్జరంలో నెంబర్ 1 ప్రాథమిక పాఠశాలలో గాంధీజీ ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎంఆర్ రెడ్డి, ఉపాధ్యాయులు కె.కాశీవిశ్వనాథం, ప్రసాద్ మాట్లాడుతూ మహాత్ముని అడుగుజాడల్లో అందరూ నడవాలన్నారు.



నల్లజర్లలో గాంధీ విగ్రహానికి చిన్నారుల నివాళులు



తాళ్లపూడిలో గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



మల్లవరంలో గాంధీ విగ్రహానికి నివాళులు

మహా సౌర యాగం



కొవ్వూరులో సౌర యాగం నిర్వహిస్తున్న దృశ్యం

కొవ్వూరు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): మహా సౌర్య యాగంతో అందరికి మంచి జరగాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరు రోడ్డు కం రైలు బ్రిడ్జి సమీపంలోని శ్రీనివాస స్నానఘట్టంలో ప్రకృతి రావణ బ్రహ్మ శివాలయ ప్రాంగణంలో మహాసౌర్య యాగం ప్రారంభించారు. మల్లన్న ఆలయ చైర్మన్ అనపర్తి శివరామకృష్ణ ఆధ్వర్యంలో సూర్య ఉపాసకులు, సన్ స్విచ్‌వల్ ఫౌండర్ విక్రమాదిత్య యాగం నిర్వహించారు. ఎమ్మెల్యే ముప్పిడి, మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు, సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, మద్దిపాటి సురేష్ యాగంలో పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను సత్కరించారు. లోక కల్యాణార్థం జరిగే ఈ యాగం 14 రోజుల పాటు జరుగుతుందని శివరామకృష్ణ అన్నారు. భక్తులు, మహిళలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

తాళ్లపూడి: ప్రక్కిలంక గ్రామంలో విశ్వేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో అర్చకుడు కొతారపు విశ్వనాథశర్మ ఆధ్వర్యంలో సౌరయాగానికి శ్రీకారం చుట్టారు. నెల రోజులపాటు రోజూ గోపూజ, సౌర జపం, అరుణ పారాయణం, సూర్య భగవానునికి అభిషేకం, సూర్య నమస్కారాలు, ఆదివారాల్లో ప్రత్యేక పూజలు జరుగుతాయని ఆయన పేర్కొన్నారు. రథసప్తమి రోజున రథోత్సవం నిర్వహిస్తామని, మార్చి 2న సూర్యనారాయణమూర్తికి శాంతి కల్యాణ జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సింహాద్రి జనార్ధనరావు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కుష్టు నివారణపై ప్రతిజ్ఞ



ఉండ్రాజవరం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): కుష్టువ్యాధి నివారణ దినం సందర్భంగా మండలంలోని సూర్యారావుపాలెంలో వేలివెన్ను పీహెచ్‌సీ డాక్టర్ ఇర్ఫాన్ ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ చేశారు. తొలుత గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఇర్ఫాన్ మాట్లాడుతూ కుష్టు వ్యాధి వ్యాప్తి, నివారణ చర్యలను వివరించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ కె.సుభాషిణి, ఆరోగ్య, సచివాలయ సిబ్బంది, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

వైసీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడిగా రమేష్



కొవ్వూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): వైసీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడిగా కొవ్వూరుకు చెందిన కౌన్సిలర్ కంటమణి రమేష్‌బాబును నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి గురువారం ఉత్తర్వులు విడుదలయ్యాయి. ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా సూరెడ్డి సీతారామయ్య, ఆర్‌టీఐ విభాగం అధ్యక్షుడిగా ఇంటి వీర్రాజులను నియమించారు. నూతనంగా నియమితులైన వారిని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు, నాయకులు అభినందించారు. నియోజకవర్గంలో పార్టీకి పూర్వ వైభవం తీసుకువచ్చేలా కృషి చేస్తానని రమేష్‌బాబు అన్నారు.

వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం

అధికారిక నిర్వహణపై హర్షం

కొవ్వూరు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారిక కార్యక్రమంగా ప్రకటించడం ఆనందదాయకమని టీడీపీ వాణిజ్య విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు మద్దుల సత్యనారాయణ అన్నారు. పెనుగొండలోని 2600 సంవత్సరాలు చరిత్ర కలిగిన వాసవిమాత ఆలయానికి ఈ నెల 31న పట్టువస్త్రాలు సమర్పించడానికి సీఎం చంద్రబాబు రానుండడంపై హర్షం వ్యక్తంచేశారు. ఏటా వాసవిమాత ఆత్మార్పణ దినోత్సవం రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించేలా జీవో 189/2024 విడుదల చేయడంపై ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

రాజీవ్‌కృష్ణ పరామర్శ

తాళ్లపూడి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాడిపూడి సర్పంచ్ నామా గోపాలంను టీడీపీ నాయకుడు రాజీవ్‌కృష్ణ గురువారం పరామర్శించారు. గోపాలం తండ్రి కృష్ణ ఇటీవల మృతి చెందారు. ఈ నేపథ్యంలో గోపాలంను రాజీవ్‌కృష్ణ పరామర్శించి కృష్ణ చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో తెలుగు యువత నాయకులు నామా సురేంద్ర, సి ద్దన రాధాకృష్ణ, గారపాటి శ్రీనివాస్, కొలుకుల వెంకన్నబాబు, సుంకర కొండబాబు, తిరుమలశెట్టి పండు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దేవరపల్లి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ట్రీకటింగ్, లైన్ల మరమ్మతుల నిమిత్తం మండలంలోని అచ్చెయ్యపాలెం, బంధపురం ఇండస్ట్రీయల్ ఫీడర్, వ్యవసాయం గృహాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ట్రాన్స్‌కో ఏఈ నారాయణ అప్పారావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8గంటల నుంచి 2గంటల వరకు నిలుపుదల చేయనున్నట్టు తెలిపారు.

సమరసత సేవా ఫౌండేషన్ సమావేశం

రాజమహేంద్రవరం కల్చరల్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): రాయుడుపాకలులోని వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో సమరత సేవా ఫౌండేషన్ జిల్లా సమావేశం గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థానం వ్యవస్థాపకులు బుద్దాల వెంకన్నబాబు, బుద్దాల అమ్మి రాజు, జిల్లా ధర్మప్రచారకర్త కుకర్రి శ్రీనివాస్, జగన్నాథం, రామ్ శంకర్, నాగమణి, రాంగోపాల్ రెడ్డి తదితరుల పాల్గొన్నారు.